ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 20.10.2026 | సంపుటి :13 సంచిక : 91 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

# అంతర్జాతీయస్థాయిలో గ్లోబల్ సమ్మిట్



## నవంబరు నెలాఖరులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలి
## స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

**ఫ్యూచర్ సిటీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి**

**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి**

**హైదరాబాద్(జనంసాక్షి):**అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో  పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ మిగతా 2లో..

## చెడుపై మంచి సాధించిన గెలుపే
# 'విజయదశమి'

**తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పండుగ శుభాకాంక్షలు**

2లో..




## మణిపూర్‌లో
# చెలరేగిన హింస

**మిలిటెంట్ల దాడిలో ముగ్గురు మృతి**

**ముఖ్యమంత్రి ఇంటి వద్ద మృతదేహాలతో నిరసన**

**క్షతగాత్రులకు సీఎం ఖేమ్‌చంద్‌సింగ్ పరామర్శ**

**ఇంఫాల్(జనంసాక్షి):** మణిపూర్‌లో మరోసారి తీవ్ర హింసాత్మక ఘటనలు తలెత్తాయి. సోమవారం ఉదయం ముగ్గురిని మిలిటెంట్లు హత్య చేశారు. దీంతో స్థానికులు నిరసనకు దిగారు. రెండు మృతదేహాలను సీఎం నివాసం వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టడంతో మిగతా 2లో..

# సెలవు



'జనంసాక్షి' పాఠకులకు, ప్రకటనకర్తలకు
**దసరా శుభాకాంక్షలు**
పండుగ సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం

# ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ



## ఛైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**సభ్యులుగా మంత్రులు ఉత్తమ్, పొంగులేటి,సీతక్క, తుమ్మల వాకిటి శ్రీహరి**

**పరిస్థితిని సమీక్షిస్తూ తగిన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఎల్‌నినో పరిస్థితిని సమీక్షిస్తూ తగిన నిర్ణయాలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాటికి శ్రీహరి సభ్యులుగా కేబినెట్ సబ్‌కమిటీ నియమిస్తూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం సలహాదారు, మాజీ సీఎస్ రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా సమన్వయం చేస్తూ అవసరమైన వివరాలు అందిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా ఉంటారని వివరించింది.

**కేబినెట్ సబ్ కమిటీ విధులు**

ఇటీవల మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు మంత్రివర్గ ఉపసంఘం మిగతా 2లో..

# దేశంలో నిశ్శబ్ద విప్లవం

## దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు




- రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- బీజేపీకి ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న ప్రజలు
- కష్టకాలంలో నిలిచిన కార్యకర్తలకు మరింత గుర్తింపు
- రాజీవ్‌గాంధీ సద్భావన యాత్రలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. రాహుల్, కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజా మద్దతు జాతీయ స్థాయిలో రాజకీయ మార్పు పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. చార్మినార్ వద్ద సోమవారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం, రాజీవ్ సద్భావన పురస్కార ప్రదానోత్సవానికి ఉత్తమ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితు ల్లోనూ కాంగ్రెస్‌కు రాహుల్ సమర్థ నాయ కత్వాన్ని అందించారని చెప్పారు. దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగడం రాజకీయ మార్పునకు సంకేతమన్నారు. బీజేపీని ఓడించి, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసే పోరా టంలో కార్యకర్తలు రాహుల్‌కు అండగా నిలవా లని పిలుపునిచ్చారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అనేక ఇబ్బందులను ఎదుర్కొని పార్టీ కోసం పనిచేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం మరింత గుర్తింపు ఇవ్వాలని ఉత్తమ్ సూచించారు. వారి పట్టుదల, త్యాగాలు, నిరంతర కృషి తెలంగాణలో కాంగ్రెస్ మిగతా 2లో..



# పారా ఆసియా గేమ్స్‌లో పసిడి బోణీ

## షూటింగ్‌లో భారత్‌కు బంగారు పతకం

- 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్ 1 విభాగంలో విజేతగా నిలిచిన మోనా అగర్వాల్
- జావెలిన్ త్రోలోనూ స్వర్ణం..
- జూడోలో పతకం ఖాయం

**టోక్యో(జనంసాక్షి):** ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట మొదలైంది. షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్ 1 విభాగంలో భారత్‌కు చెందిన ఇద్దరు షూటర్లు ఫైనల్‌లో తలపడ్డారు. అందులో మోనా అగర్వాల్ విజేతగా నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల తేడాతో అవని లేఖర రజతంతో సరిపెట్టుకుంది. మోనా మొత్తం 250పాయింట్లు సాధించగా.. అవని 249.6 పాయింట్లు రాబట్టింది. ఇక దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి (227.9) మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. పురుషుల మిగతా 2లో..

## కోలిండియా తరహాలో సింగరేణి ఉద్యోగులకు
# జీతాలు



- సంస్థ అధికారులకు దసరా కానుక
- అధికారుల విజ్ఞప్తిని నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి
- ఎగ్జిక్యూటివ్ క్యాడర్1 నుంచి 7 వరకు సుమారు 1800 మందికి ప్రయోజనం
- సెప్టెంబర్ 25 వ తేదీ నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తింపు

2లో..



## నన్నెందుకు టార్గెట్ చేశారో అర్థం కావట్లేదు

**టైగర్ ష్రాఫ్**

- నిందితులను పట్టుకున్న రాజస్థాన్ పోలీసులు

2లో..

# పోలీసు అధికారినే బురిడీ కొట్టించి..

**హనీట్రాప్‌తో డబ్బులు డిమాండ్ చేసిన దుండగుడు**

**హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఘటనను ఛేదించిన పోలీసులు**

**హైదరాబాద్(జనంసాక్షి):**మహిళ పేరుతో పోలీసు అధికారినే బురిడీ కొట్టించాడో నిందితుడు. చాటింగ్ ద్వారా పరిచయం పెంచుకొని డబ్బులు డిమాండ్ చేశాడు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ హనీట్రాప్ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు పవన్‌ను మీడియా ఎదుట ప్రవేశపెట్టి.. కేసు వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే వెల్లడించారు. మహిళ పేరుతో నిందితుడు పోలీసు మిగతా 2లో..



## సర్ గందరగోళాన్ని ఈసీయే
# పరిష్కరించాలి



ఈసీ నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రత్యేక శిబిరాలు, ఎల్‌ఓల ఇంటింటి సందర్శనల అసలు రూపాన్ని ఈ నివేదికలు బయటపెడుతున్నాయి. ఓటు కోల్పోయిన చాలా మందికి ఈ శిబిరాల గురించి తెలియదు. అలాగే వారిని బూత్ స్థాయి అధికారులు కూడా సంప్రదించలేదు. తమ వినాశకరమైన ఎస్‌ఐఆర్ వల్ల ఏర్పడిన గందరగోళాన్ని పౌర సమాజం కాకుండా, స్వయంగా ఎన్నికల సంఘమే పరిష్కరించాలి. రాజ్యాంగ విరుద్ధమైన 'సర్'ను వెంటనే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్లందరినీ తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలి. - జైరాం రమేశ్

**ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి**

**కాంగ్రెస్ పార్టీ డిమాండ్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని దిల్లీలో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి ఓట్లను అక్రమంగా తొలగించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ గందరగోళాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని, ఓటర్ల కోసం శిబిరాలు నిర్వహిస్తున్న పౌర సమాజానిది (సివిల్ సొసైటీ) కాదని విమర్శించింది. దిల్లీలోని రెండు పోలింగ్ బూత్‌లలో దాదాపు 100 మంది ఓటర్లను గైర్హాజరు, బదిలీ, మరణించడం, నకిలీ కేటగిరీల కింద తప్పుగా తొలగించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక మీడియా నివేదికను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న తీరు, కేంద్రం, ఎన్నికల సంఘం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "దిల్లీలో ఈ వినాశకరమైన ఎస్‌ఐఆర్ ప్రక్రియలో మిగతా 2లో..

## సీజేపీ నాయకుల జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాకు నిరాశ ఎదురైంది. వీరి జ్యుడీషియల్ కస్టడీని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ మరో రెండు రోజులు పొడిగించారు. మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో నేడు కొత్తగా నియమితులైన ఎస్ఈఎం

మిగతా 2లో..



# మా సత్తా ఏంటో వారికి తెలుసు

**మీ అదృష్టాన్ని ఇంకోసారి పరీక్షించుకోవాలనుకుంటున్నారా?**

**ఈ సారి మరింత బలంగా కలబడతాం**

**అమెరికా ఇజ్రాయెల్‌కు అబ్బాస్ అరాగ్చీ హెచ్చరిక**



**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు రహస్య చర్చలు జరు పుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ పని పూర్తి చేస్తామంటూ ట్రంప్ తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరుదేశాలు తమపై దాడి చేసినప్పుడు టెహ్రాన్ సమర్థంగా పోరాడి, తానేంటో నిరూపించుకుందన్నారు. ఇప్పుడు మరోసారి మా పని పూర్తి చేస్తామని అనుకుంటే మరింత బలంగా కలబడతామన్నారు. 'అమెరికా, ఇజ్రాయెల్ మీ అదృష్టాన్ని ఇంకోసారి పరీక్షించుకోవాలనుకుంటున్నారా? అయితే ప్రయత్నించండి. కానీ, జాగ్రత్త. మాకు కూడా పూర్తికాని పనులు చాలా ఉన్నాయి' మిగతా 2లో..

## పారా ఆసియా గేమ్స్‌లో పసిడి బోణీ

జూడో 70 కేజీల జే1 విభాగంలో కపిల్ పర్మార్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. కాంస్య పోరులో ఇండోనేషియాకు చెందిన అఫ్నాఫ్ రఫ్లిపై కపిల్ విజయం సాధించాడు. అంతకుముందు సెమీస్‌లో ఇండోనేషియాకు చెందిన జునాయిది చేతిలో 0-1 తేడాతో కపిల్ ఓటమిని చవిచూశాడు.ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. పురుషుల టీ47 లాంగ్ జంప్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ నిషద్ కుమార్ స్వర్ణం గెలుచుకున్నాడు. 7.11 మీటర్ల దూరం దూకి ఆయన ఈ ఘనత సాధించాడు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒమద్బెక్ ఖసనోవ్ రజతం, శ్రీలంకకు చెందిన మహమ్మద్ సఫ్రాన్ కాంస్యం గెలుచుకున్నారు.

జావెలిన్ త్రోలో స్వర్ణం..

జావెలిన్ త్రో ఎఫ్46 విభాగంలో స్వర్ణ, రజత పతకాలు భారత్‌నే వరించాయి. తొలి నుంచి అజీత్ సింగ్ (65.02 మీటర్లు) గోల్డ్ రేసులో ఉండగా.. రింకు ఒక్కసారిగా తన చివరి త్రోలో 65.11 మీటర్లు విసిరి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. దీంతో అజీత్ రజతంతో సరిపెట్టుకున్నాడు. తొలుత మహిళల 1500 మీటర్ల టీ11 రేసులో కాంస్యం సాధించిన రక్షిత రాజుపై అనర్హత వేటు పడింది. దీంతో ఆ తర్వాత నాలుగో ప్లేస్‌లో నిలిచిన భారత్ రవన్ని వలసనైనికి కాంస్యం దక్కింది. రక్షితపై ఎందుకు అనర్హత వేటు పడిందో కారణం తెలియరాలేదు.

జూడోలో పతకం ఖాయం

మహిళల జూడో 52 కేజీల జే2 విభాగంలో భారత్‌కు పతకం ఖాయమైంది. కోకిల ఫైనల్‌కు చేరుకుని సత్తా చాటింది. సెమీస్‌లో కోకిల 1-0 ఆధిక్యంతో చైనాకు చెందిన యు లియుపై విజయం సాధించింది. ఫైనల్‌లో కజకిస్థాన్‌కు చెందిన ఐబికె ఉలాన్బెక్‌తో స్వర్ణం కోసం పోరాడనుంది.

బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ..

బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ భారత్‌కు పతకం ఖాయమైంది. నితీశ్ కుమార్ తులసిమతి మురుగేశన్ జోడీ ఎస్ఎల్ 3 - ఎస్‌యూ 5 విభాగంలో సెమీస్‌కు దూసుకెళ్లింది. గ్రూప్ బిలో అజేయంగా నిలిచిన భారత్ జోడీ సెమీస్‌లో అడుగు పెట్టింది. తొలి మ్యాచ్‌లో భారత్‌కు వాకోవర్ వచ్చింది. రెండో మ్యాచ్‌లో చైనాకు చెందిన చెన్ పెంగ్‌ఫెయి - హువాంగ్‌పై 21-4, 21-18 తేడాతో భారత జోడీ విజయం సాధించింది.

శీతల్ సూపర్ రికార్డు

పారా మహిళా ఆర్చర్ శీతల్ దేవి అద్భుతమైన ప్రదర్శన చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా గేమ్స్ రికార్డు నమోదు చేయగా.. ప్రపంచ రికార్డును సమం చేసింది. మహిళల కాంపౌండ్ క్వాలిఫికేషన్‌లో 750 పాయింట్లకుగాను శీతల్ 702 పాయింట్లు సాధించింది. చేతులు లేని ఆమె.. కాలితోనే ఆర్చరీలో అద్భుతాలు చేస్తోంది.

## పోలీసు అధికారినే బురిడీ కొట్టించి..

అధికారిని ట్రాప్ చేసినట్లు చెప్పారు."నిందితుడు పవన్‌ను సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళగా పరిచయం చేసుకున్న నిందితుడు పోలీసు అధికారితో వాట్సప్‌లో చాటింగ్ చేసి మరింత దగ్గరయ్యాడు. ఆ తర్వాత డబ్బులు డిమాండ్ చేసినట్లు మాకు సమాచారం అందింది. దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నాం. నిందితుడి జాబితాలో వందల మంది బాధితులు ఉన్నారు. వేలాది వాట్సప్ చాటింగ్‌లు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ హనీట్రాప్ బాధితులు ఉన్నారు. దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్నవారు కూడా పవన్ చేతిలో మోసపోయినట్లు మాకు సమాచారం ఉంది" అని డీసీపీ వెల్లడించారు.

## అంతర్జాతీయ స్థాయిలో 'గ్లోబల్ సమ్మిట్'



గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. కానుంది. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. అందుకే సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబం ధించి అధికారులు ఒక కమిటీని నియమించుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పోలీస్ కమిషనరేట్ ను ప్రారంభించిన సీఎం**

భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించే ముందు ఇబ్రహీం పట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భవనంలోని కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించి తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించిన ఆయన... ఎఫ్ సీ డీఏ కార్యాలయ ఆవరణలో ఔఐజఓ ( నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో చెలరేగిన హింస

ఇంఫాల్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు ఇంఫాల్, కాంగ్‌పోక్పి జిల్లాల సరిహద్దుల్లో వంటచెరకు సేకరిస్తున్న వారిపై మిలిటెంట్లు కాల్పులు జరిపిన ఘటనలో ముగ్గురు గాయపడగా.. మరో ముగ్గురు అదృశ్యమైనట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7గంటల సమయంలో కొండ ప్రాంతంలో వంట చెరకు కోసం 16 మంది వెళ్లగా.. ఆ సమయంలోనే మిలిటెంట్ల దాడి జరిగిందని వివరించారు. ఇదిలా ఉండగా.. 2023 నుంచి రగులు తోన్న హింసాకాండపై ఆగ్రహించిన స్థానికులు మృతదేహాలను ఇంఫాల్‌కు తీసుకొచ్చి సీఎం నివాసం ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఈ నిరసన సమయంలో సీఎం ఇంట్లో ఉన్నారా ? లేదా అనేది తెలియలేదు. ఈ క్రమంలో నిర సనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అనంతరం మృతదేహాలను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

**క్షతగాత్రులకు సీఎం పరామర్శ**

మరోవైపు, తన నివాసం వెలుపల నిరసనల నేపథ్యంలో సీఎం ఖేమ్‌చంద్‌సింగ్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

## నన్నెందుకు టార్గెట్ చేశారో అర్థం కావట్లేదు

ముంబై(జనంసాక్షి):బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన కలకలం రేపుతోంది. తనను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడం లేదని, గతంలో తనకు ఎలాంటి బెదిరింపులు రాలేదని, ఎవరితోనూ శత్రుత్వం లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేతో టైగర్ ష్రాఫ్ చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆయనతో సమావేశమైన సమయంలో వెల్లడించినట్లు జాతీయ మీడియా పేర్కొంది.సాధారణంగా వారాంతాల్లో ఫుట్‌బాల్ ఆడిన తర్వాత అభిమానులతో టైగర్ ష్రాఫ్ ఫొటోలు దిగుతుంటారు. ఆదివారం అలసటగా అనిపించడంతో అభిమానులతో ఫొటోలు దిగలేదట. ఈ నిర్ణయం తనను ప్రమాదం నుంచి తప్పించిందని శిందేతో చెప్పినట్లు సమాచారం. అలాగే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, నటుడు సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వ్యవహారాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో తెలియడం లేదని టైగర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.మరోవైపు కాల్పుల అనంతరం ఆదివారం రాత్రి టైగర్ ష్రాఫ్‌ను పరామర్శించిన ఏక్‌నాథ్ శిందే.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నటుడికి వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, ఆయన నివాసం వద్ద పోలీసు భద్రతను పెంచే చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

నిందితులను పట్టుకున్న రాజస్థాన్ పోలీసులు

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు పాల్పడిన నిందితులను రాజస్థాన్ పోలీసులు పకడ్బందీగా అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను కోటా ఎస్పీ మీడియాకు వెల్లడించారు. "కాల్పులకు పాల్పడిన అనుమానితులు రైల్లో ప్రయాణిస్తున్నారని, వారు కోటాకు చేరుకోవచ్చని సమాచారం అందింది. దాంతో వెంటనే మా బృందం రంగంలోకి దిగింది. రైలును ఆపించి, భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. 15 నిమిషాల్లోపే మా బృందం వారిని అదుపులోకి తీసుకోగలిగింది. వారిని మేం ముంబయి పోలీసులకు అప్పగిస్తాం" అని పేర్కొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ

ఎల్‌నినో పరిస్థితులు సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు ఇస్తుందని ఉత్తర్వుల్లో సర్కార్ పేర్కొంది. రానున్న రోజుల్లో సాగు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరత, రిజర్వాయర్లు, నిధుల నిర్వహణ కీలకం కానున్న తరుణంలో ఆయా శాఖల మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ప్రజలు చేయాల్సిన పనులు, కేంద్ర సహకారం వంటి అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చిస్తుందని వివరించింది.

**ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కార్యాచరణ**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో నిమగ్నమైంది. వర్షాభావం కారణంగా సుమారు 11.18 లక్షల ఎకరాల్లోని పంటలు చేతికందే అవకాశం లేదనే అంచనాల నేపథ్యంలో? వివిధ శాఖల పరిధిలోని పరిస్థితుల నివేదికలను సేకరించి, ప్రత్యామ్నాయ చర్యలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

రూ.20వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీ కోసం విజ్ఞప్తి

ఇటీవల జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేశారు. సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాజాగా కేబినెట్ నిర్ణయం మేరకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది.

## అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు

**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన**



వాషింగ్టన్(జనంసాక్షి): ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. అమెరికాలోని ప్రతి పిల్లాడికీ వచ్చే ఏడాది తన స్పేస్‌ఎక్స్ కంపెనీకి చెందిన షేరును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్.. కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాను ఏర్పాటు చేసే నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన వేళ ఎలాన్ మస్క్ స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు.'ఆంత్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' ను ఏర్పాటు చేసి సంస్థలో 5 శాతం వాటాలను ఈ నిధికి కేటాయిస్తామని ఆంత్రోపిక్ ప్రకటించింది. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతిసారీ మరో 2 శాతం వాటాలను అదనంగా కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదేవిధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించనున్నట్లు ఆంత్రోపిక్ తెలిపింది.ఈ ప్రకటనపై మస్క్ స్పందిస్తూ.. వాటాలను ప్రజానిధికి చేరవేసే బదులు.. నేరుగా ప్రజలకే ఇవ్వాలని ఎక్స్ వేదికగా సూచించారు. 'నేను కూడా భవిష్యత్‌లో ఇదే చేయబోతున్నా' అని ప్రకటించారు. ఏ కంపెనీ షేర్లు అనేది తొలుత వెల్లడించనప్పటికీ.. తర్వాత స్పేస్‌ఎక్స్‌లో ఒక్కో షేరును ప్రతి పిల్లాడికీ కేటాయించనున్నట్లు మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత స్పేస్ ఎక్స్ షేరు ధర 146.03 డాలర్లు ఉంది.

## చెడుపై మంచి సాధించిన గెలుపే 'విజయదశమి'

హైదరాబాద్(జనంసాక్షి):చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను.రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని అన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

ఫారం-6

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము,
జోగుళాంబ గద్వాల జిల్లా

**ప్రాథమిక ప్రకటన**

భూసేకరణ పునరావాస పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

లేఖ సంఖ్య : B2/07/2026 తేదీ: 29.09.2026

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలము ఎల్కూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.2.72 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా BM1/M-10R/D-5L/P-105 Package No.105 నిమిత్తం జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ జోగుళాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టము 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్‌కు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూముల కై నోటీసు జారీ చేయనైనది.

**షెడ్యూలు**

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /అనాతి /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏమైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల వివరము | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 233 | పట్టా | మెట్ట | 2.72 | 1) జి.కృష్ణయ్య తండ్రి తిమ్మన్న 2) జి.నర్సింహులు తండ్రి తిమ్మన్న 3) జి.రాముడు తండ్రి తిమ్మన్న 4) జి.ఆంజనేయులు తండ్రి తిమ్మన్న 5) గొంగడిగారి ఉలిగమ్మ భర్త: గొంగడిగారి మల్లకల్ | - | - | - | - | - | - | - | - |
| | విస్తీర్ణము | | | 2.72 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టరు, జోగుళాంబ గద్వాల జిల్లా, ప్రత్యేక ఉపకలెక్టరు, జె.ఎల్.ఐ.పి., గద్వాల, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, జె.ఎల్.ఐ.పి., గద్వాల, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

సం/-.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల

సం/- అదనపు కలెక్టరు జోగులాంబ గద్వాల జిల్లా

సం/-. కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO.NO: 1053/LA/PP/Advt/Pub/2026-27


## కోలిండియా తరహాలో సింగరేణి ఉద్యోగులకు జీతాలు

హైదరాబాద్(జనంసాక్షి): సింగరేణి అధికారుల చిరకాల విజ్ఞప్తిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరింది. కోలిండియా తరహా వేతనాలను అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్?1 నుంచి ఎగ్జిక్యూటివ్ క్యాడర్?7 వరకు ఉన్న సుమారు 1,800 మంది అధికారులకు ప్రయోజనం చేకూరనుంది. ??సవరించిన బేసిక్ వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. అయితే, ఆర్థిక ప్రయోజనాలు సింగరేణి బోర్డు ఆమోదం తెలిపిన సెప్టెంబర్ 25, 2026 నుంచి వర్తిస్తాయి. ఈ పెరిగిన వేతనాలను అక్టోబరు నెల జీతాల నుంచి చెల్లించనున్నారు. సవరించిన వేతనాల అమలుకు సంబంధించి సంస్థ డైరెక్టర్ (పర్సనల్) శ్రీ గౌతమ్ పోట్రు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.కోలిండియాలో వేతన అసమానతల నేపథ్యంలో, మహారత్న సంస్థల వేతన విధానాన్ని తమకు అమలు చేయాలని కోలిండియా అధికారులు కోరారు. ఆ ప్రతిపాదనకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోలిండియా యాజమాన్యం ఆమోదం తెలిపాయి. అదే విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని సంస్థ అధికారులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.?ఈ విజ్ఞప్తిపై స్పందించిన శ్రీ భట్టి విక్రమార్క దసరాలోపు అధికారులకు శుభవార్త అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది జులైలో సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం కమిటీని ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగా బోర్డు ఆమోదంతో వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు.?తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, ఇచ్చిన హామీని నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం మరింత అంకితభావంతో బొగ్గు ఉత్పత్తి చేసి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతామని పేర్కొన్నారు.ఇటీవలే కార్మికులకు 596 కోట్ల బోనస్...?ఇటీవలే దసరా సందర్భంగా సింగరేణిలోని దాదాపు 39 వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం తీపి కబురుగా 596 కోట్ల రూపాయల బోనస్ అందించిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సింగరేణి లోని కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారికి రూ.5,500 చొప్పున బోనస్ ను ప్రకటించారు. తాజాగా అధికారులకు వేతన సవరణపై ఉత్తర్వులు వెలువడటం విశేషం.

# దేశంలో నిశ్శబ్ద విప్లవం

తిరిగి అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. వారి సేవలను మరువరాదన్నారు.పార్టీ ముఖ్య కార్యక్రమాలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రజాప్రతినిధులు విస్తృతంగా పాల్గొనడం ద్వారా కార్యకర్తలకు గుర్తింపు లభించడంతోపాటు సంస్థాగతంగా పార్టీ బలోపేతమవుతుందని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని స్పష్టం చేశారు.మతసామరస్యం, జాతీయ సమైక్యత సందేశంతో రాజీవ్‌గాంధీ చేపట్టిన సద్భావన యాత్రను స్మరించుకుంటూ 1990 నుంచి ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీని ఉత్తమ్ అభినందించారు. పదవులతో నిమిత్తం లేకుండా తాను ఈ కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం, సమాచార సాంకేతిక రంగం, పంచాయతీరాజ్, యువత సాధికారతకు రాజీవ్‌గాంధీ చేసిన కృషిని తెలంగాణ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్ కొనియాడారు. ఐక్యత, పరస్పర గౌరవం, రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం రాజీవ్ ఆశయాలని పేర్కొన్నారు. కంప్యూటరీకరణ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యాన్ని ఆయన ముందుగానే గుర్తించారని అన్నారు.పంజాబ్, అసోం, మిజోరంలలో శాంతి పునరుద్ధరణకు రాజీవ్ కృషి చేశారని సావంత్ గుర్తుచేశారు. పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం, స్థానిక పాలనలో మహిళల భాగస్వామ్యం పెంపునకు చొరవ చూపారని చెప్పారు. ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ప్రజాస్వామ్య ప్రక్రియలో విస్తృత భాగస్వామ్యం కల్పించారని పేర్కొన్నారు.కులం, మతం పేరుతో సమాజంలో పెరుగుతున్న విభజనలపై సావంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మతపరమైన విభజనలు దేశాన్ని బలహీన పరుస్తాయని అన్నారు. ప్రేమ, సామరస్యం, జాతీయ సమైక్యత విలువలను కాపాడాలని కోరారు. విద్వేషాన్ని ఎదుర్కొని సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ చేస్తున్న ప్రయత్నాలకు కార్యకర్తలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.త్యాగం, లౌకికవాదం, జాతీయ సమైక్యత, మతసామరస్యానికి సంబంధించిన రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి. మల్లికార్జునను సత్కరించారు. ప్రజాసేవకు అంకితమైన వ్యక్తులను గుర్తిస్తూ ఏటా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులను వక్తలు అభినందించారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, మాజీ మంత్రి గీతారెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, ఫిరోజ్‌ఖాన్, డాక్టర్ సి. మల్లికార్జునతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పార్టీ బాధ్యులు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మా సత్తా ఎంటో వారికి తెలుసు

అని అరాగ్చీ హెచ్చరించా రు. స్వదేశంలో చట్టపరమైన పరిణామాలను తప్పించుకోవడానికి నెతన్యా హు అమెరికాను మరో సైనిక ఘర్షణలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారని ఇ రాన్ మంత్రి ఆరోపించారు. ఆయన జైలు జీవితాన్ని తప్పించుకోవడానికి ట్రంప్‌ను వాడుకుంటున్నారన్నారు. ఈ చర్యల పర్యవసానాలను ఇజ్రాయె ల్‌తో పాటు, అగ్రరాజ్యం కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

నెతన్యాహును కాకుండా వేరే వారిని ఎన్నుకోవద్దు: ఇజ్రాయెలీలకు ట్రంప్ హెచ్చరిక అక్టోబర్ 27న జరగనున్న ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికలకు ముందు నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఇరాన్‌తో ఘర్షణను సమర్థంగా ఎదుర్కొని, ఇజ్రాయెల్‌లో శాంతిని నెలకొల్పారన్నారు. మరోసారి ప్రధానిగా ఆయన ఎన్నికకు తాను మద్దతిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశానికి వేరే నాయకుడిని ఎన్నుకోవద్దని ఇజ్రాయెల్ ప్రజలను హెచ్చరించారు. ఒకవేళ వారు తప్పుడు నేతను ఎన్నుకుంటే అమెరికా జోక్యం చేసుకోవాల్సి వస్తుందన్నారు. దశాబ్దాలుగా ఇజ్రాయెల్, అమెరికాలకు ఇరాన్ ముప్పుగా పరిణమిస్తోందని ఆరోపించారు. నెతన్యాహు లేకపోతే టెహ్రాన్ ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఆ దేశం తన పంథాను మార్చుకోకపోతే త్వరలోనే దాని పని పూర్తి చేస్తామని హెచ్చరించారు.

## సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసులు సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు చేశారు. అంతర్రాష్ట్ర సింథటిక్ డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌ను ఛేదించారు. మహారాష్ట్రలోని గోండియా జిల్లా మారేగవ్‌లో రహస్య ల్యాబ్‌లో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ తయారీకి వినియోగించినట్లు అనుమానిస్తున్న పరికరాలు, రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, మహారాష్ట్రలో విస్తరించిన డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి.

## సీజేపీ నాయకుల జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఎదుట సీజేపీ నాయకులను పోలీసులు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని కోరారు. ఈ నేపథ్యంలో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ఎస్‌ఈఎం ఆదేశాలు జారీ చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఇటీవల దేశవ్యాప్తంగా సీజేపీ ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా దిల్లీలోని జంతర్‌మంతర్‌కు చేరడంతో.. ఒక ప్రైవేటు ప్రాంగణంలోకి చొరబడ్డారన్న ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ నెల 14న కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో తిహాడ్ జైలుకు తరలించారు. తాజాగా కస్టడీ ముగియడంతో పోలీసులు ఎస్‌ఈఎం ఎదుట హాజరు పరిచారు. తాజా పరిణామంతో సీజేపీ నేతలిద్దరూ బుధవారం వరకు జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండనున్నారు. సీజేపీ నేతలను తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆ పార్టీ ప్రతినిధి రత్నసింగ్ స్పందించారు. జ్యుడీషియల్ కస్టడీపై చట్టపరంగా అన్ని వాదనలు వినిపించినట్లు తెలిపారు. కానీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిరాధార ఆరోపణలతో తమ వాదనలకు కౌంటర్ చేయలేకపోయారని తెలిపారు. సౌరవ్ దాస్, రాంకాలు ఇప్పటికే ఐదు రోజులు జైలులో ఉన్నారని, ష్యూరిటీ వెరిఫికేషన్ అవసరమన్న కారణంతో వారిద్దరి స్వేచ్ఛను పరిమితం చేయడం సరికాదని ఆమె అన్నారు. నేడు వీరిద్దరినీ తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి పంపడానికి ఎలాంటి కారణం లేదన్న ఆమె.. ఈ అంశంపై తాము ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

## హైదరాబాద్‌లో 75 మంది ఎస్సైల బదిలీ..

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్సైలు) బదిలీ జరిగింది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది ఎస్సైలను సీపీ సజ్జనర్ బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

## 'సర్' గందరగోళాన్ని ఈసీయే పరిష్కరించాలి

భాగంగా జరిగిన ఓట్ల తొలగింపులలో అత్యధిక శాతం ఏఎస్ఎస్‌డీ కేటగిరీల కిందనే జరిగాయి. అంటే గైర్హాజరు, బదిలీ, మరణం, నకిలీ ఓట్లు అన్నమాట. బీజేపీ, దాని అనధికార ప్రతినిధులు దీనిని ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం అని చెప్పుకుంటూ ఎస్ఐఆర్‌ను సమర్థించుకుంటున్నారు. కానీ దిల్లీలోని పౌర సమాజ సంస్థలు నిర్వహించిన ఒక పబ్లిక్ ఆడిట్ పేరుతో విస్తృతంగా జరుగుతున్న తప్పుడు తొలగింపులను బట్టబయలు చేసింది. కేవలం 2 పోలింగ్ బూత్‌లలోనే తప్పుగా తొలగించిన కనీసం 100 మంది ఓటర్లను వారు కనుగొన్నారు. వీరిలో అత్యధికులు బదిలీ లేదా గైర్హాజరు కేటగిరీలకు చెందినవారే. దేశవ్యాప్తంగా కేవలం ఈ రెండు కేటగిరీలలోనే 9 కోట్లకు పైగా ఓటర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. వీరిలో ఎంతమంది నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారో?"అని జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ సమయంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఇంటింటి పర్యటనల వాస్తవాలను ఇటువంటి అవకతవకలు బయటపెట్టాయని జైరాం రమేశ్ ఆరోపించారు. అక్రమంగా తొలగించిన ఓటర్లను మళ్లీ ఓటర్ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. " కేంద్ర ఎన్నికల సంఘం నష్ట నివారణ చర్యల్లో భాగంగా తన వివిధ పత్రికా ప్రకటనలలో హామీ ఇచ్చిన ప్రత్యేక శిబిరాలు, బీఎల్‌ఓల ఇంటింటి సందర్శనల అసలు రూపాన్ని ఈ నివేదికలు బయటపెడుతున్నాయి. ఓటు కోల్పోయిన చాలా మందికి ఈ శిబిరాల గురించి తెలియదు. అలాగే వారిని బూత్ స్థాయి అధికారులు కూడా సంప్రదించలేదు. తమ వినాశకరమైన ఎస్ఐఆర్ వల్ల ఏర్పడిన గందరగోళాన్ని పౌర సమాజం కాకుండా, స్వయంగా ఎన్నికల సంఘమే పరిష్కరించాలి. చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి అని అన్నారు

# ఎవరి అండతో ఈ మాఫియా..?

సంపాదకీయం

ప్రజాస్వామ్య దేశంలో ప్రైవేటు తుపాకులు బహిరంగంగా గర్జిస్తుంటే చట్టం ఎక్కడుంది? కాల్పులతో భయపెట్టేంత ధైర్యం నేరగాళ్లకు ఎక్కడి నుంచి వస్తోంది? చట్టంపై భయం లేకనా? లేక తమ వెనుక పలుకుబడి ఉన్న శక్తుల అండ ఉందనే ధీమానా? తుపాకులు పేలుతున్నాయి.. బెదిరింపులు పెరుగుతున్నాయి.. కానీ వాటి వెనుక ఉన్న అసలు శక్తులెవరో తేల్చడంలో వ్యవస్థ ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన మరోసారి ఈ ప్రశ్నలను తెరపైకి తెచ్చింది. తుపాకులు ఎక్కడి నుంచి వచ్చాయి? కాల్పుల వెనుక ఎవరున్నారు? ఈ ముఠాలకు ఆర్థికంగా, రాజకీయంగా లేదా ఇతర రూపాల్లో అండ అందిస్తున్నవారు ఉన్నారా? దర్యాప్తు సంస్థలు ఈ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పాలి. కాల్పుల ఘటనను ఒక సంచలన వార్తగా మాత్రమే చూడకుండా, దాని వెనుక ఉన్న నేర వ్యవస్థను గుర్తించి కూకటివేళ్లతో నిర్మూలించాల్సిన అవసరం ఉంది.

సెలబ్రిటీల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ, సామాన్యుల రక్షణ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. పలుకుబడి ఉన్నవారికి భద్రత, సాధారణ పౌరులకు నిరీక్షణ అనే పరిస్థితి ఏర్పడితే ప్రజలకు వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? వ్యక్తిగత భద్రత పేరుతో ఆయుధాలు కలిగి ఉండటం ఒకటైతే, వాటిని భయపెట్టడానికి ఉపయోగించడం మరొకటి. ఈ రెండింటి మధ్య గీతను చట్టం స్పష్టంగా గీయాలి. ఆయుధాల లైసెన్సులు, వాటి వినియోగం, ప్రైవేటు భద్రతా సిబ్బంది కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

కాల్పులు జరిగిన తర్వాత కొందరిని అరెస్టు చేసి చేతులు దులుపుకోవడం సరిపోదు. అక్రమ ఆయుధాల సరఫరా, నేర ముఠాల నెట్‌వర్క్‌లు, వాటికి సహకరిస్తున్న శక్తుల మూలాలను వెలికితీయాలి. నేరగాళ్లకు ఆయుధాలు సమకూర్చుతున్నవారు ఎవరు? వారిని వెనుక నుంచి నడిపిస్తున్నవారు ఎవరు? చట్టం నుంచి తప్పించుకునేందుకు వారికి సహకరిస్తున్న వ్యవస్థ ఏదైనా ఉందా? ఈ కోణాల్లోనూ దర్యాప్తు జరగాలి. ఆధారాలుంటే ఎంతటి పలుకుబడి ఉన్నవారినైనా చట్టం ముందు నిలబెట్టాలి. అదే సమయంలో, దర్యాప్తు పూర్తికాకముందే ఎవరినీ దోషిగా ముద్ర వేయకూడదు.

తుపాకీ వెనుక ఉన్న చేతిని పట్టుకోవడమే కాదు, దానికి ధైర్యాన్నిస్తున్న వ్యవస్థనూ ప్రశ్నించాలి. నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరనే నమ్మకం ప్రజల్లో కలగాలి. చట్టం సామాన్యుడికే కాదు, సెలబ్రిటీలకు, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి, నేర ముఠాలకూ సమానంగా వర్తించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ. లేకపోతే తుపాకీ శబ్దం ముందు చట్ట స్వరం మూగబోయిందనే భావన ప్రజల్లో మరింత బలపడుతుంది.

# ఆదివాసీల ఆరాధ్య దైవం రావణబ్రహ్మ



ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికి ఏ మతాన్ని అయినా స్వీకరించే స్వేచ్ఛ ఉంటుంది. ఇతరుల మతాన్ని గాని మత విశ్వాసాలను గాని కించపరచడం రాజ్యాంగ వ్యతిరేకం. చట్టరీత్యా నేరం కూడా. కానీ ప్రతి ఏటా విజయదశమి రోజున రావణాసురుని వధ నిర్వహించడం ఒక నిరంతర ప్రక్రియగా మారింది. కానీ అది పురాతన ఆదివాసి తెగల ఆత్మగౌరవానికి ఆటంకంగా మారింది.

తమ దేవుళ్లను తాము కొలుచుకోవడం సరిపోదు అన్నట్లు ఆదిమ జాతుల దైవమైన రావణున్ని వద చేసి సంబరపడడం దేనికి నిదర్శనం ? ఏ మతతత్వ శక్తుల ఆధిపత్య ధోరణికి నిదర్శనం ?

### సీతను అపహరించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది ?

తండ్రి మాట కోసం 14 ఏళ్ళు అరణ్యవాసానికి వెళ్లిన రాముడు. అరణ్యం అంటే మళ్ళీ దట్టమైన అడవులు... అంటే అనివార్యంగా ఆదివాసులు ఉంటారు. ఇది ఒక భాగం రాముడు అరణ్యవాసం వచ్చిన తర్వాతనే సీతను అపారించడం దాంతో రాముడు రావణునితో యుద్ధం చేయడం, స్త్రీని అపహరించినందుకు రావణుడిని రాక్షసినిగా చూడటం రాముడు లంకను జయించిన విజయసంకేతంగా రావణ వధ జరగడం మొదలైంది. కానీ రాజ్యపాలన చేసుకుని రావణుడు సీతను ఎందుకు లంకకు తీసుకు పోవాల్సి వచ్చింది అనేది ప్రశ్న ??

మధ్య భారతదేశం లోని గోండ్వానను రాజ్యంగా చేసుకొని పాలించిన రాజు రావణుడు. అరణ్యవాసానికి విచ్చేసిన రాముడు బయట ప్రాంతం నుంచి వచ్చాడు గిరిజనేత్తర జాతి కనుక రాముడు కొంత అందంగా కనిపించే మనసు పడేసుకుంది సూర్పనక్క. దాంతో ఆమె ముక్కు చెవులు కోయమని లక్ష్మణుడిని ఆజ్ఞాపించాడు రాముడు. ఇది తెలిసిన రావణుడు "నా చెల్లి ముక్కు చూడు కోయటం ఏంటని" ఆగ్రహించి సీతను తాకకుండా లంకకు తీసుకెళ్లడం జరుగుతుంది. అది కూడా సీతను తాకకుండా భూమిని పెకిలించి తీసుకెళ్తాడు పరాయి స్త్రీని తాగకుండా పవిత్రంగా చూడడం గోండ్వానా పాలనలు భాగం.

### ముమ్మాటికి అధర్మ యుద్ధమే!

తదుపరి రాముడు రాజమార్గాన్ని ఎన్నుకోకుండా యుద్ధ మార్గాన్ని ఎన్నుకున్నాడు. గోండ్వానా సైన్యాన్ని విచ్చిన్నం చేయడం కోసం వాలి, సుగ్రీవుల మధ్య విభేదాలు సృష్టించి వారిని ఎదురుగా చంపలేక దొంగ చాటున చంపి అధర్మ యుద్ధ నీతిని ప్రదర్శించాడు రాముడు. విభజించి పాలించి సుగ్రీవ సైన్యాన్ని తనవైపు తిప్పుకున్నాడు. రావణున్ని యుద్ధంలో ఢీ కొనలేక విభీషణుని తనకు కోవట్టుగా మార్చుకొని, రావణుడి బలహీనతలు తెలుసుకొని, నీతి తప్పి యుద్ధం గెలిచాడు రాముడు. ఎదురుగా నిలబడి యుద్ధం చేయడం యుద్ధనీతి. బలహీనతలతో యుద్ధం చేయడం అధర్మ యుద్ధం. నేటి సమాజం అధర్మ యుద్ధాన్ని చరిత్ర పొడవునా ప్రచారం చేస్తుంది.

### రావణుడు స్త్రీలను చెరిచేవాడైతే..

రావణుడు రాక్షసుడు అని, స్త్రీలను అత్యాచారాలు చేసే నికృష్టుడని రావణ వధ జరుపుతున్నాయి కొన్ని మతతత్వ శక్తులు, చరిత్ర తెలియని వారు లంకలో సీత సుమారు 10 సంవత్సరాల కాలం ఉంది సీతను రావణుడు ఏమైనా చేసి ఉంటే చాకలి అవమానానికి అగ్ని ప్రవేశం చేసిన సీత ప్రతి వ్రతగా నిలిచేది కాదు. సీతను బలవంతం చేయలేదంటే, రావణుడు నీతివంతుడు అని అర్థం. సీతను తాకకుండా భూమిని పెకిలించి తీసుకెళ్లిన తీరు చూస్తే రావణుడు ఎలా రాక్షసుడు అవుతాడు ?

### విజయదశమి అర్థాన్ని మార్చేశారు..

విజయదశమి నాడు వివిధ రకాల కులాలు, తెగలవారు, ప్రజానికం జమ్మి చెట్టుకు పూజ చేసి తమ పనిముట్లను , ఆయుధాలను పూజ చేయిస్తారు. కానీ నేడు అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు మతం రంగు పూసుకొని మతతత్వ శక్తులను ప్రోత్సహించి ప్రతి ఏటా విజయదశమి రావణ వధకు సంకేతంగా జరుపుకుంటున్నవి. తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ చివరిలో రావణ వధ చేస్తున్నారు. పైగా రావణుడికి పది తలలు ఉన్నాయని దశ అవతారుడుని ప్రచారం అందుకే రాక్షసుడని ముద్ర. రామాయణ కాలంలోనూ, నవీన కాలంలోనూ పది తలలు కలిగిన మనుషులు ఉండడం కల్పితమే కాక మరేమవుతుంది ? రామాయణంలో గోండ్ సమాజమంతా రాక్షసులుగా చిత్రీకరించబడింది. ఈ ఆధునిక కాలంలో అదే ఆదివాసి సమాజంలో రావణుడిని మళ్లీ దేవుడిగా తీసుకొచ్చారు గుళ్ళ నిర్మాణం చాప కింద నీరులా జరిగిపోతుంది.

### రావణబ్రహ్మ రాక్షసుడు కాదు...

మతతత్వ శక్తులు, ఆదివాసి చరిత్రను వెక్కిరిస్తున్నాయి. మధ్యభారత ఆదివాసులు మొత్తంగా తాము రావణ సంతతి అని భావించి, తమ సంస్కృతిక ఉద్యమాన్ని ఉధృతం చేసే రోజు ఆసన్నమైన వేళ.. ఏ మతతత్వ శక్తులు ఈ ఉద్యమాన్ని ఆపలేవనేది చరిత్ర నిరూపించిన అంశం. అందుకే నేటి సమాజానికి ఆయనే రావణబ్రహ్మ ఆదివాసులకు ఆరాధ్య బ్రహ్మ.



వ్యాస కర్త
కుడ్మేత శ్రీనివాస్
9177166152

# డా. అంబేద్కర్ ఆలోచనలకు అద్దం దీక్ష భూమి

**డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశంలో సామాజిక సమానత్వం, న్యాయానికి ప్రేరణ ఇచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన నాయకత్వంలో 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో జరిగిన బౌద్ధ ధమ్మ దీక్ష కార్యక్రమం భారత చరిత్రలో పెను మార్పునకు నాంది పలికింది. ఆ మహత్తర కార్యక్రమం జరిగిన ప్రదేశాన్ని "దీక్ష భూమి" అంటారు. విజయదశమి సందర్భంగా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు అక్కడికి చేరుకుని సామూహిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, ధమ్మ స్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.**



దీక్షభూమి అనేది కేవలం ఒక స్థలం మాత్రమే కాదు. అది సామాజిక సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కోసం జరిగిన పోరాటానికి ప్రతీక. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషికి అద్దం పట్టే స్థలం. ఆయన ఆలోచనలు, ఆచరణను ప్రతిబింబిస్తూ, సమానత్వం కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది.

దేశంలోని మెజారిటీ ప్రజలైన "బహుజనుల" సామాజిక అభ్యున్నతి కోసం, సమానత్వం కలిగిన సమ, సమాజ నిర్మాణం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషిని గుర్తుచేసే పవిత్ర ప్రదేశం దీక్ష భూమి.

దీక్షభూమిలో 1956లో జరిగిన బౌద్ధ ధమ్మ దీక్ష కార్యక్రమం భారతదేశంలో సామాజిక, రాజకీయ రంగాల్లో గణనీయమైన మార్పునకు దోహదపడింది, ఇది బహుజనుల సామాజిక చైతన్యానికి కొత్త పునాది వేసినట్లయింది.

ప్రతి సంవత్సరం విజయదశమి సందర్భంగా దీక్షభూమిలో పెద్ద ఎత్తున బౌద్ధులు, అంబేద్కర్ అనుచరులు సమావేశమవుతారు. బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిజ్ఞ చేస్తారు.

దీక్షభూమిలో బుద్ధుడు, ధర్మం, సమానత్వంపై ఉపన్యాసాలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమాల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ సిద్ధాంతాలను, ఆయన ఆలోచనలను, ఆచరణను ప్రతిబింబించేలా ప్రజలు పాల్గొంటారు.

విజయదశమి ఉత్సవాలు

విజయదశమి పర్వదినం భారతదేశంలో ఒక ముఖ్యమైన పండుగగా నిలుస్తుంది. అయితే, దీక్షభూమిలో ఈ రోజు సామాజిక మార్పు, సమానత్వం, బౌద్ధధమ్మ స్వీకరణకు సంబంధించిన ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956లో ఇదే రోజున బౌద్ధధర్మంలోకి ప్రవేశించడం వల్ల విజయదశమి సందర్భంగా లక్షలాది మంది ఆయన ఆలోచనలను స్మరించుకోవడానికి నాగపూర్‌కు చేరుకుంటారు. అందుకే దీక్షభూమి ప్రతి సంవత్సరం లక్షలాది మందితో కిక్కిరిసిపోతుంది.

### దీక్షభూమి ప్రాముఖ్యత

బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ భారత దేశంలోని దేశంలోని మెజార్టీ ప్రజలు అయిన బహుజనుల ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత. ఆయన సమానత్వం, సామాజిక న్యాయం, సామాజిక సమర్థత కోసం చేసిన కృషిని గుర్తుచేస్తుంది.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం కేవలం మత మార్పిడి కాదు; అది సామాజిక సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కోసం జరిగిన చారిత్రక పరిణామం.

### ఈ రోజు రహదారులు అన్నీ నాగపూర్ వైపే

ప్రతి సంవత్సరం అశోక విజయదశమి రోజుకు మూడు, నాలుగు రోజుల ముందుగానే దేశం నలుమూలల నుంచి ప్రజలు తండోపతండాలుగా నాగపూర్‌కు వస్తుంటారు. రైళ్లు, బస్సులు, కార్లు, లారీలు, జీపులు తదితర వాహనాల్లో ప్రజలు నాగపూర్ చేరుకుంటారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లపై, కాలినడకన కూడా ప్రజలు వస్తుంటారు.

ప్రతి మారుమూల గ్రామం నుంచి ప్రజలు నాగపూర్‌కు చేరుకుని దీక్షా భూమిని దర్శించుకుంటారు. బౌద్ధ సన్యాసులు, భంతేజీలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

దీక్షభూమికి వచ్చే దారులన్నీ పెద్ద పెద్ద ర్యాలీలు, ఊరేగింపులతో కిక్కిరిసిపోతాయి. ఈ ర్యాలీల్లో ప్రజలు క్రమశిక్షణతో పాల్గొంటారు. పర్యవేక్షణ కోసం పోలీసులు ఉన్నప్పటికీ, సమతా సైనిక్ దళ్ కార్యకర్తలు కూడా కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

బయటి ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలను నాగపూర్ వాసులు ఆత్మీయంగా పలకరిస్తూ, అతిథులుగా భావిస్తారు. నాగపూర్‌కు వచ్చే రహదారులు, కూడళ్లలో టెంట్లు వేసి పెద్ద ఎత్తున వచ్చిన వారికి ఉచితంగా భోజనవసతి కల్పిస్తారు.

రైల్వే స్టేషన్, బస్టాండ్ వంటి ప్రాంతాలకు వచ్చిన వారికి భోజనాలు అందిస్తూ, బాబాసాహెబ్ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. అశోక విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

దీక్షభూమిలో అనేక కార్యక్రమాలు జరుగుతాయి. వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకుంటాయి.

ఇలా తండోప తండాలుగా దీక్షభూమికి వచ్చే ప్రజలను చూస్తుంటే, అంబేద్కర్ పట్ల ప్రజలకు ఉన్న గౌరవం, అభిమానం ఇప్పటికీ కొనసాగుతున్నాయని అర్థమవుతుంది.

### యోలా సభలో ప్రకటన

డాక్టర్ అంబేద్కర్ 1935 అక్టోబర్ 13న మహారాష్ట్రలోని "యోలా" ప్రాంతంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, "నేను హిందువుగా పుట్టడం నా చేతుల్లో లేదు. కానీ నేను హిందువుగా మాత్రం మరణించను" అని బహిరంగంగా ప్రకటించారు.

ఆ ప్రకటన అప్పట్లో పెద్ద సంచలనం రేకెత్తించింది. అస్పృశ్యత, కులవివక్ష హిందూ మత వ్యవస్థలో అంతర్లీనంగా ఉన్నాయని ఆయన భావించారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కోసం కులవ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు.

వర్ణాశ్రమ ధర్మంలో భాగంగా కొనసాగుతున్న కులతత్వ విధానం వ్యక్తి స్వేచ్ఛను, అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆయన భావించారు. కులతత్వాన్ని నిర్మూలించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

బౌద్ధ ధర్మంలోని కరుణ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలు అణగారిన ప్రజలకు కొత్త దిశను చూపుతాయని ఆయన విశ్వసించారు. అందుకే బౌద్ధ దమ్మ స్వీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు.

### బుద్ధుడు -- ప్రజాస్వామ్యం

డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో ప్రజాస్వామ్యం అనేది కేవలం ప్రభుత్వ రూపం మాత్రమే కాదు. ప్రతి వ్యక్తి ఆలోచనలో, కుటుంబ జీవితంలో, సమాజంలో ఆచరణలో ఉండాల్సిన విలువ.

ప్రజాస్వామ్యాన్ని ప్రజలందరూ ఆచరించాలని ఆయన ఆకాంక్షించారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ప్రజల జీవితాల్లో భాగం కావాలని భావించారు.

కులవ్యవస్థను సమర్థించే సిద్ధాంతాలు వ్యక్తి స్వేచ్ఛను, సామాజిక అభివృద్ధిని అడ్డుకుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. బౌద్ధ ధర్మంలోని మానవతా విలువలు సమాజాన్ని మార్పు దిశగా నడిపిస్తాయని నమ్మారు.

దీక్షభూమి డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలకు, కార్యాచరణకు అద్దం పట్టే శాశ్వత స్థలం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆయన ఆశయాలను మనకు గుర్తుచేసే ఒక చారిత్రక ప్రదేశం.

దీక్షభూమి వంటి ప్రదేశాలు డా: బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ప్రదేశాలు సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం కోసం జరిగే ఉద్యమాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి.



గోషిక మల్లేశం

# రిటైర్డ్ సింగరేణి నల్ల సూర్యుల అంతులేని వేదన

**1968 సంవత్సరంలో వచ్చిన గోవుల గోపన్న చిత్రంలోని గోమాతపై వచ్చిన వినరా వినరా నరుడా ..**

కల్లాకపటం యెరుగని గంగీగోవును నేనూ
ఏది చెప్పినా కాదని ఎదురు చెప్పలేను
పారేసిన గడ్డి తినీ బ్రతుకు గడుపుతున్నాను
పారేసిన గడ్డి తినీ బ్రతుకు గడుపుతున్నాను...
పరుల సేవకే సర్వం త్యాగం చేస్తున్నాను..
వినరా వినరా నరుడా...తెలుసుకోర పామరుడా
...
కమ్మనైన గుమ్మపాలు కడవలతో ఇస్తున్నా...
నా దూడల కాదని మీ కడుపులు నిండిస్తున్నా ..
వినరా వినరా నరుడా...తెలుసుకోర పామరుడా
..

అనే పాట మాదిరిగా సింగరేణి సంస్థ మరియు రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి ఉన్నది సంస్థ తెలంగాణ విస్తృతస్థాయిలో అభివృద్ధికి తోడ్పడుతున్నది. దాదాపు క్రొత్తగా ఏ పథకాన్ని ప్రారంభించిన సింగరేణి నిధులు ఉపయోగపడుతున్నవి సింగరేణి ఒక కామధేనువు! కానీ రక్తాన్ని చెమటగా చిందించి ప్రకృతి విరుద్ధంగా విషవాయువులతో సావాసం చేస్తూ చీకటి గుహలలో నుండి బొగ్గును వెలికి తీస్తూ దేశానికి ఇంధనం విద్యుత్ శక్తిని యవ్వన జీవితం జాతికి ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగులు జీవిత చరమాంకంలో అత్యంత ధీన పరిస్థితిలో జీవనయానం గడుపుతున్నారు చాలీచాలని పెన్షన్ తో వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలతో సరియైన మెరుగైన వైద్య సౌకర్యాలు అందక దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని లెక్కలేని సార్లు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఇతర మంత్రులకు స్వయంగా కలిసి వినతి పత్రాలు అందజేసిన ఫలితం శూన్యం. ఒక్క మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మాత్రం తన వంతు ప్రయత్నం చేస్తున్న సింగరేణి యాజమాన్యం కనికరించడం లేదు ఈ విషయములో ప్రస్తుత సింగరేణి చైర్మన్ ను ముఖాముఖిగా కలిసి విన్నవించాలని ఎన్నోసార్లు ప్రయత్నించిన అనుమతి లభించడం లేదు డైరెక్టర్ పా ను ఒకసారి కలిసినా సరియైన స్పందన లేదు సింగరేణి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో గల స్వయం ప్రతిపత్తి గల సంస్థ దినదినం పెరుగుతున్న వైద్య ఖర్చులకు క్రొత్త క్రొత్తగా పుట్టుకొస్తున్న రోగాలకు ప్రస్తుతం అమలులో ఉన్న జీవితాంత 8 లక్షలు రూపాయల వైద్య భీమా భార్యాభర్తలు ఇరువురికి సరిపోదు దేశాభివృద్ధికి సర్వస్వం ధార పోసిన మాకు బొగ్గు పరిశ్రమలో పనిచేసిన్నప్పుడు పొందిన అనారోగ్యాన్ని చివరి దశలో ఆరోగ్యంగా జీవించుటకు మెరుగైన ఉచిత ఆరోగ్య భిక్ష పెట్టాలని సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులను వేడుకొనుచున్నాము సత్వరమే రాష్ట్ర ముఖ్యమంత్రి సింగరేణి యాజమాన్యం తో సమీక్ష సమావేశాలు నిర్వహించి సంవత్సరాలుగా ఆశతో ఎదురుచూస్తున్న మా సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని ముక్కిలితా హస్తాలతో వేడుకుంటున్నాము.

దండంరాజు రాంచందర్ రావు
అధ్యక్షుడు
సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్రా హైదరాబాద్



# ప్రజాస్వామ్య విద్యకు జాన్ డ్యూయి పునాది.. అంబేద్కర్‌కు స్ఫూర్తి

**అక్టోబర్ 20న జాన్ డ్యూయి జయంతి**

విద్య అనేది కేవలం అక్షరజ్ఞానం కాదు.. మనిషిని ప్రశ్నించే శక్తిగా, సమాజాన్ని మార్చే ఆయుధంగా తీర్చిదిద్దే ప్రక్రియ అని ప్రముఖ విద్యావేత్త జాన్ డ్యూయి అన్నారు. ప్రపంచ విద్యా చరిత్రలో జాన్ డ్యూయి పేరు ఒక విప్లవాత్మక ఆలోచనకు ప్రతీక. భారతదేశంలో సామాజిక వివక్షతపై పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు మేధో, సామాజిక సంస్కరణలతో చైనాను ప్రభావితం చేసిన హు షి- ఇద్దరూ జాన్ డ్యూయి బోధనలతో ప్రభావితమయ్యారు. జాన్ డ్యూయి1859 అక్టోబర్ 20న జన్మించిన గొప్ప తత్వవేత్త. ఆయన విద్యను ప్రజాస్వామ్య సమాజ నిర్మాణానికి సాధనంగా చూశారు. ప్రజాస్వామ్య విలువలతో విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాడు. విద్యను కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, మార్కులు, సర్టిఫికెట్లకు పరిమితం చేసే సంకుచిత దృక్పథాన్ని సవాలు చేశాడు. విద్య అనేది జీవితంతో ముడిపడిన నిరంతర అనుభవం, ఆలోచన, పరిశీలన, ప్రయోగం, సామాజిక మార్పుల ప్రక్రియగా పేర్కొన్నాడు. విద్యార్థి నిశ్శబ్దంగా వినే వ్యక్తిగా కాకుండా, స్వయంగా ఆలోచించే, ప్రశ్నించే, పరిశోధించే, నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకే విద్యా ప్రజాస్వామీకరణకు పునాది వేసిన జాన్ డ్యూయి తత్వాన్ని భారతదేశ ఉపాధ్యాయ విద్య శిక్షణలో కరీకులంలో చేర్చారు.

### అంబేద్కర్‌పై డ్యూయి తాత్విక ప్రభావం

ప్రొఫెసర్ జాన్ డ్యూయి తాత్విక ప్రభావం అంబేద్కర్ ఆలోచనా విధానంపై గణనీయమైన ముద్ర వేసింది. 1913--1916 మధ్యకాలంలో అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయంలో డ్యూయి ప్రతిపాదించిన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, విమర్శనాత్మక ఆలోచన వంటి భావాలతో అంబేద్కర్ ప్రభావితమయ్యారు. భారతదేశంలో సామాజిక వివక్షకు వ్యతిరేకంగా మహద్ సత్యాగ్రహం, కాలారామ్ ఆలయ ప్రవేశ ఉద్యమాలకు పిలుపునిచ్చారు. డ్యూయి విద్యను ప్రజాస్వామ్య సమాజ నిర్మాణానికి సాధనంగా భావిస్తే, అంబేద్కర్ విద్యను కుల వివక్ష, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడే ఆయుధంగా మలిచారు. చారిత్రకంగా వివక్షకు గురైన ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన ఉద్యమించారు. ఆ విలువలను భారత రాజ్యాంగంలో స్థానం కల్పించారు. అందువల్ల డ్యూయి ఆలోచనలు అంబేద్కర్‌కు కేవలం విద్యా తత్వాన్ని అందించలేదు, విద్య ద్వారా వివక్షను ఎదుర్కొని, హక్కుల కోసం పోరాడి, ప్రజాస్వామ్య సమాజాన్ని నిర్మించే ఒక మేధోపునాదిగా మారారు. డ్యూయి తరగతి గదిలో విద్యార్థి స్వతంత్ర ఆలోచనకు ప్రాధాన్యమిస్తే, మరోవైపు అంబేద్కర్ సమాజంలో మనిషి స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవించడానికి అవసరమైన విద్య, సమానత్వం, రాజ్యాంగ హక్కులకు ప్రాధాన్యత ఇచ్చాడు.

### భారత విద్యావ్యవస్థకు డ్యూయి ఎందుకు అవసరం?

రాజ్యాంగం ద్వారా విద్య అందరికీ అందుబాటులోకి వచ్చినా, నాణ్యమైన విద్య కొందరికే పరిమితమైంది. ప్రభుత్వ విద్య బలహీనపడుతూ, ప్రైవేట్ విద్య కొన్ని సామాజిక వర్గాల ఆధిపత్యంలోకొనసాగుతూ ఫ్యూడల్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో, నాణ్యమైన విద్యను ప్రజాస్వామీకరించి అందరికీ సమానంగా అందించడం అత్యవసరం. మన విద్య ఇప్పటికీ పరీక్షలు, ర్యాంకులు, మార్కుల చుట్టూ తిరుగుతోంది. విద్యార్థుల సహజ ఆసక్తి, సృజనాత్మకత, తార్కిక ఆలోచన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. విద్యార్థుల స్వతంత్ర ఆలోచనా శక్తిని కుంచించుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో డ్యూయి ప్రతిపాదించిన 'చేస్తూ నేర్చుకోవడం' (గాముతీఅఱఅస్త్ర ఎఎ ఌశీఱఅస్త్ర), అనుభవాధారిత విద్య, ప్రజాస్వామ్య తరగతి గది, విమర్శనాత్మక ఆలోచన భారత విద్యావ్యవస్థకు అత్యంత అవసరం. ఈ క్రమంలో నూతన విద్యా విధానం 2020 సైతం విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, కమ్యూనికేషన్, సహకారం నైపుణ్యాలకు పెద్దపీట చేయాలని సూచించింది. పిల్లలు ప్రయోగాలు చేయాలి, ప్రశ్నలు వేయాలి, చర్చల్లో పాల్గొనాలి, స్థానిక సమస్యలను అధ్యయనం చేయాలి, తమ అనుభవాలను శాస్త్రీయ జ్ఞానంతో అనుసంధానించాలి. ఉపాధ్యాయుడు కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తిగా కాకుండా, విద్యార్థుల్లో జిజ్ఞాసను రగిలించే మార్గదర్శిగా మారాలి. జాన్ డ్యూయి ఆలోచనల ప్రభావంతో ప్రాజెక్టు పద్ధతి అభివృద్ధి చెందింది. ఈ పద్ధతిలో విద్యార్థులు స్వయంగా పనులు చేస్తూ, అనుభవాల ద్వారా జ్ఞానాన్ని సంపాదిస్తారు. కావున గ్రామీణ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యను జీవితానుభవాలతో అనుసంధానించాలి. జాన్ డ్యూయి ప్రజాస్వామ్యం పాఠ్యపుస్తకాల్లో ఒక పాఠంగా మిగిలిపోకుండా, తరగతి గదిలోనే సమాన భాగస్వామ్యం, పరస్పర గౌరవం, భిన్నాభిప్రాయాలను వినే సంస్కృతిగా ఆచరణలోకి రావాలి.



సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
798957942

## ఇన్‌స్పైర్ మానక్ జాతీయ పోటీల్లో హైదరాబాద్ విద్యార్థుల ప్రతిభ

- టాప్-60లో రెండు ప్రాజెక్టులకు చోటు దక్కించుకున్న హైదరాబాద్ విద్యార్థులు




**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** 12వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డ్స్ - మానక్ ప్రదర్శన, ప్రాజెక్టుల పోటీల్లో హైదరాబాద్ జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. న్యూఢిల్లీలో అక్టోబర్ 12 నుంచి 14 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టుల పోటీల్లో(ఎన్ఎల్ఈపిసి) జిల్లా విద్యార్థు లు రూపొందించిన రెండు ప్రాజెక్టులు ప్రతిష్ఠాత్మక టాప్–60 జాబితాలో చోటు దక్కించుకున్నాయి. దేశ వ్యాప్తంగా యువ ఆవిష్కర్తలు ప్రదర్శించిన 800 ప్రాజెక్టుల్లో తెలంగాణ నుంచి 52 ప్రాజెక్టులు పాల్గొన్నాయి. జాతీయ స్థాయిలో టాప్–60లో తెలంగాణకు చెందిన ఐదు ప్రాజెక్టులు ఎంపిక కాగా, వాటిలో హైదరాబాద్ జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక కావడం విశేషం. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్‌కు చెందిన వైష్ణవి గోవర్ధన్ రూపొందించిన 'ఇ–క్లౌడ్ స్మార్ట్ డ్రైనేజ్' ప్రాజెక్టు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టుకు దాక్షాయని గైడ్ ఉపాధ్యాయురాలిగా వ్యవహరించారు. అలాగే హైదరాబాద్‌లోని వి.బి.ఎన్.దేవ్‌నార్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌కు చెందిన రెహాన్ రాజా రూపొందించిన 'దృష్టి లోపం ఉన్నవారి కోసం మెడిసిన్ బాక్స్' ప్రాజెక్టు కూడా టాప్–60లో స్థానం సంపాదించింది. ఈ ప్రాజెక్టుకు పరమేశ్వరన్ గైడ్ ఉపాధ్యాయుడిగా మార్గనిర్దేశం చేశారు. జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులను, వారి గైడ్ ఉపాధ్యాయులను హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అభినందించి సత్కరించారు. విద్యార్థులు ప్రాజెక్టుల్లో ప్రదర్శించిన సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, ఆచరణాత్మక సమస్యలకు పరిష్కారాలు చూపే విధానాన్ని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలతో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని పాఠశాలల్లో శాస్త్ర విజ్ఞాన కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ సి.ధర్మేందర్ రావు సేవలను అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఏవో వెంకట్రామిరెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ సి.ధర్మేందర్ రావు, బ్లైండ్ స్కూల్ చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ దవాఖానలో పాముకాటుకు మందుల్లేవ్..!

- వేరే హాస్పిటల్‌కి వెళ్లండని సిఫారసు
- స్టోర్‌లో మందులు ఉన్నాయంటున్న డాక్టర్లు
- ఉన్న కూడా ఇవ్వకపోవడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం
- విచారించి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**మర్పల్లి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ దవాఖానకు వస్తే.. ఇక్కడ మందులు లేవు, మరో ఆసుపత్రికి వెళ్లాలంటూ వైద్యులు సూచిస్తే పేద ప్రజల పరిస్థితి ఏమిటి? ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రిలో అత్యవసర మందులు ఉన్నప్పటికీ వాటిని బాధితుడికి అందించలేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘటన ప్రభుత్వ వైద్య సేవల తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పాముకాటుకు మందు (ఏఎస్‌వీ) అందుబాటులో లేదని బాధితుడిని మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఆసుపత్రి స్టోర్‌లో మందుల నిల్వలు ఉన్నప్పటికీ, వాటిని సకాలంలో అందించలేకపోయారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గొల్ల బిచ్చయ్య ఆదివారం రాత్రి పశువులని పొలం మేపుకొని వస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అత్యవసరంగా ఏఎస్‌వీ మందు అందించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఆసుపత్రిలో మందులు లేవని, మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో చేసేదేమీ లేక బాధితుడిని హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మార్గమధ్యంలో సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎస్‌వీ మందు అందించిన అనంతరం అక్కడి నుంచి పంపించినట్లు వారు పేర్కొన్నారు. సంగారెడ్డిలోనూ పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో రాత్రి రెండు గంటల సమయంలో బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రి స్టోర్‌లో ఏఎస్‌వీ మందుల నిల్వలు ఉన్నప్పటికీ, స్టోర్ ఇన్‌చార్జి అందుబాటులో లేకపోవడం, ఫార్మసిస్ట్ విధుల్లో లేకపోవడంతో బాధితుడికి మందులు అందించలేకపోయారనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఫార్మసిస్ట్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో మందులు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఆసుపత్రిలో మందుల నిల్వలు ఉన్నాయని చెబుతుండగా, మరోవైపు బాధితుడికి మందులు అందుబాటులో లేవని చెప్పడం విస్మయానికి గురిచేస్తోంది. మందులు ఉన్నాయా? లేవా? ఉన్నప్పటికీ ఎందుకు అందించలేకపోయారు? విధుల్లో సిబ్బంది లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పాముకాటుకు గురైన బిచ్చయ్య ఆరోగ్య పరిస్థితి సోమవారం కూడా పూర్తిగా మెరుగుపడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పాము విషం ప్రభావంతో ఆరోగ్యం దెబ్బతినడంతో డయాలసిస్ చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు పేర్కొన్నారు. బాధితుడికి తొలుత మర్పల్లి ఆసుపత్రిలో అత్యవసర వైద్యం అందిస్తే పరిస్థితి మరోలా ఉండేదేమోనని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సకాలంలో వైద్యం అందకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణమా అనే అంశంపై వైద్యుల పూర్తి నివేదిక రావాల్సి ఉంది. మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నప్పటికీ, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో మందులు అందించలేకపోతే ఆ ఆసుపత్రి వల్ల ప్రజలకు ప్రయోజనం




ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడం ఆర్థికంగా భారంగా మారుతోందని చెబుతున్నారు. అత్యవసర మందులు స్టోర్‌లో ఉన్నా, వాటిని అందించడానికి సిబ్బంది లేకపోవడం వంటి కారణాలతో రోగులను మరో ఆసుపత్రికి పంపాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తిప్పడం వల్ల విలువైన సమయం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి స్టోర్‌లో ఏఎస్‌వీ మందుల నిల్వలు ఎంత ఉన్న కూడా బాధితుడు వచ్చిన సమయంలో మందులు ఎందుకు అందించలేదని, ఫార్మసిస్ట్, స్టోర్ ఇన్‌చార్జి అందుబాటులో లేకపోవడానికి కారణాలేమిటనే అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచడంతోపాటు, రాత్రి వేళల్లోనూ వైద్యులు, ఫార్మసీ సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో మధుయాష్కీ గౌడ్ భేటీ

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చ
- ఏఐపీసీ బలోపేతానికి సహకరిస్తా సీఎం రేవంత్ రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఐపీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మధుయాష్కీ గౌడ్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురి మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై వడ్డీ భారం తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరంపై ముఖ్యమంత్రి, మధుయాష్కీ గౌడ్ చర్చించినట్లు తెలిసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంపై చర్చ జరిగినట్లు సమాచారం.

ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఫ్యూచర్ సిటీ నిర్మాణం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అభిప్రాయపడినట్లు తెలిసింది. ప్రభుత్వ శాఖలు, సంక్షేమ పథకాల అమలుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి, పురోగతిని అంచనా వేసే విధానం మరింత బలోపేతం కావాలని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇరువురు ప్రస్తావించినట్లు తెలిసింది.

### ఏఐపీసీ బలోపేతానికి సీఎం సహకారం

తెలంగాణలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను బలోపేతం



చేయడం, వివిధ రంగాలకు చెందిన నిపుణులను సంస్థలో భాగస్వాములను చేయడం వంటి అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. ఏఐపీసీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సమాచారం. విద్య, వైద్యం, పరిశ్రమలు, సాంకేతికత, ఆర్థిక రంగాలతో పాటు వివిధ వృత్తి రంగాలకు చెందిన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై సమగ్ర చర్చలకు అవకాశం కల్పించడంపై ఇరువురు దృష్టి సారించినట్లు తెలిసింది. ప్రొఫెషనల్స్ అనుభవం, నైపుణ్యాలను వినియోగించుకోవడం ద్వారా నూతన విధానాల రూపకల్పనకు, అభివృద్ధి కార్యక్రమాల మెరుగుదలకు తోడ్పాటు లభిస్తుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై నిపుణుల సూచనలు, నివేదికలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశాలపైనా చర్చించినట్లు తెలిసింది.

## పరీక్షల నిర్వహణలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు సూచించిన జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** నియామక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల ని, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారా యణ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అక్టోబర్ 24, 26 తేదీల్లో నిర్వహించనున్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ (గ్రేడ్––××), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ నియామక పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పరిధి లోని ఈ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత నియా మక పరీక్షలు(సీబీఆర్టీ) నిర్వహించనున్నట్లు తెలి పారు. అసిస్టెంట్ సైంటిస్ట్ పరీక్ష అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్ష అక్టో బర్ 26న రెండు సెషన్లలో జరగనున్నాయి. ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిం చనున్నారు. హైదరాబాద్‌లో కేటాయించిన నాలు గు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,505 మంది అభ్యర్థు లు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు ఒక రోజు ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, కేంద్రాల్లో పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సరఫరా, రవాణా సదుపాయాలు, తాగునీరు, ప్రథ మ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాల ని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు అప్రమత్తంగా వ్యవహ రిస్తూ పరీక్షలు సజావుగా, ఎలాంటి అవకతవకల కు తావులేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్నానానికి వెళ్లి కేఎల్ఐ కాలువలో వ్యక్తి గల్లంతు

- ఆచూకీ కోసం అధికారుల ముమ్మర గాలింపు

**మిడ్జిల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** మండలం లోనీ అయ్యవారిపల్లి గ్రామ శివారులో సోమవారం కేఎల్ఐ కాలువలో స్నానానికి వెళ్లి వ్యక్తి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ముమ్మర గాలింపు చర్యలు మొదలు పెట్టారు స్థానికులు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవులు అనే వ్యక్తి గ్రామ శివారులోని కేఎల్ఐ కాలువలో స్నానం చేయడానికి వెళ్లారు. కాలువలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో ఆయన కొట్టుకుపోయారు. కాలువ గట్టుపై ఆయన బట్టలు, చెప్పులు మాత్రమే కనిపించడంతో స్థానిక రైతులు, గ్రామస్తులు ఆయన గల్లంతైనట్లు గుర్తించారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో స్థానికులు. ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు యాదవ్. ఫైర్ సిబ్బందితో కలిసి కాలువ పొడవునా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ చెరువు విస్తరణ, కట్ట ఎత్తు పెంపు ప్రతిపాదనలతో గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఊట్కూర్‌ను వెంటనే ముంపు గ్రామంగా ప్రకటించి, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గంలో ఎన్ని చెరువులను నింపుతున్నారు, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించనున్నారు అనే వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని రామ్మోహన్ రెడ్డి కోరారు. కొడంగల్‌కు సాగునీరు అందించే క్రమంలో మక్తల్ నియోజకవర్గం నీటితోపాటు భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. మరోవైపు, మక్తల్ – నారాయణపేట ప్రధాన రహదారి దుస్థితిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధిని డిమాండ్ చేస్తూ 30 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గుంతల కారణంగా వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం సకాలంలో చేరుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. రహదారి పనులకు రూ.237 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నాలుగు నెలల క్రితం 170 గుంతలు ఉన్నాయని చెప్పగా, మంత్రి సీతక్క పర్యటన సమయానికి వాటి సంఖ్య 700కు చేరిందని తెలిపారు. అయినప్పటికీ గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రహ్మాన్, తరుణ్, ఆనంద్ రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కోరం శివారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



## సీఎం పర్యటనకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు పూర్తి

- భద్రత, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

**అచ్చంపేట, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం, వంగూరు మండలంలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో నిర్వహించే దసరా వేడుకల్లో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణా రెడ్డి, సోమవారం కొండారెడ్డిపల్లిని సందర్శించి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కొండారెడ్డిపల్లిలో దసరా వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కట్ట మైసమ్మ దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం దసరా సంప్రదాయంలో భాగంగా గ్రామ సరిహద్దులో ఉన్న



జమ్మి చెట్టు వద్దకు పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఐడబ్ల్యూఓ ఎస్పీ రామ్ చందర్ తదితరులు కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆలయాలు, జమ్మి చెట్టు వద్ద నిర్వహించనున్న కార్యక్రమాల ప్రదేశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, వాహనాల రాకపోకల నిర్వహణ, ప్రజల రాకపోకలకు అవసరమైన మార్గాలు, కార్యక్రమాల ప్రాంగణాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పూర్తిచేయాల్సిన పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన ముఖ్యమంత్రి పర్యటన భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం,తదితరులతో కలిసి వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌కు, సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏవైనా లోటుపాట్లు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భద్రత అధికారి శ్రీధర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

- టీఆర్ఎస్ ఇంచార్జి రాఘవేందర్ రెడ్డి



**తాండూరు, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** యువత రాజకీయాల్లోకి రావాలని టీఆర్ఎస్ ఇంచార్జి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం తాండూరు పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ నాయకురాలు విరమణీ అక్క నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాండూరు టీఆర్ఎస్ ఇంచార్జి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. టైంపాస్ రాజకీయాలకు కాకుండా అభివృద్ధి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. విద్య, వైద్యం అంశాలపై ప్రజల్లోకి వెళ్లి చైతన్యం కల్పిస్తాం" అని అన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని పార్టీ ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. రాబోయే అన్ని ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ పోటీ చేయడం పక్కా. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ప్రత్యేక చొరవ చూపుతాం. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. అశోక్, వీరణ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
20 అక్టోబర్ 2026

# రేవంత్ అసమర్థతతో రైతులకు వరిగోస

- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన, అస్తవ్యస్తమైన విద్యుత్ సరఫరాతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఆయన ధ్వజమెత్తారు. వనపర్తి మండలం పెద్దగూడెం తండాలో విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిన వరి పంటలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో ఆవేదనలో ఉన్న గిరిజన రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### కళ్లముందే ఎండిన పంటలు.. కన్నీటిపర్యంతమైన రైతులు

పెద్దగూడెం తండాకు చెందిన రైతులు రూప్ల నాయక్, దేశ నాయక్, చందు నాయక్, దూద్య నాయక్ తదితరులు తమకు జరిగిన పంట నష్టాన్ని మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎకరాకు రూ.25 వేల చొప్పున పెట్టుబడి పెట్టి వరి సాగు చేశామని, పంట ఏపుగా పెరిగి చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలన లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో పొలాలకు నీరు అందక, సాగునీరు ఉన్నప్పటికీ పంటను కాపాడుకోలేకపోయామని మహిళా రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. రైతుల ఆవేదనను విన్న నిరంజన్ రెడ్డి, ఎండిపోయిన పంటలను పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని, వారి తరఫున ప్రభుత్వంపై పోరాడి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

### 150 ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పెద్దగూడెం తండాలోనే సుమారు 150 ఎకరాల్లో వరి పంట నిలువునా ఎండిపోయిందని తెలిపారు. వనపర్తి జిల్లాలోని పలు గ్రామాల్లోనూ వానాకాలం పంటలు విద్యుత్ కోతల కారణంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గ్రామాలవారీగా పరిశీలిస్తే 100 నుంచి 500 ఎకరాల వరకు పంట నష్టం జరిగిన పరిస్థితులు ఉన్నాయని వివరించారు.

సాగునీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ, సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేని ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతులు అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టంపై తక్షణమే సమగ్ర సమీక్ష నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

### గిరిజన రైతులకు పట్టాలిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన రైతుల హక్కులకు ప్రాధాన్యత ఇచ్చామని నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో 96 మంది గిరిజన రైతులకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు అందించామని, మరో 56 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అటవీ ప్రాంతంలో రెండు చెరువులు నిర్మించడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి లభ్యత మెరుగుపడిందని తెలిపారు. అయితే, నీరు ఉన్నా సకాలంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు పంటలను కాపాడుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### బొగ్గు లేదంటూ తప్పించుకోవడం సరికాదు

విద్యుత్ సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన అవగాహన, ముందుచూపు లేదని నిరంజన్ రెడ్డి విమర్శించారు. బొగ్గు కొరత పేరుతో ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో సుమారు 70 టీఎంసీల నీటి లభ్యత ఉందని పేర్కొంటూ, నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను సక్రమంగా నడపడం లేదని ఆరోపించారు. పంపుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా మరమ్మతుల సమస్యలు తలెత్తుతున్నాయని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ముందుచూపు, సమర్థవంతమైన ప్రణాళికతో వ్యవహరించడం లేదని మండిపడ్డారు. కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

### రైతులు తిరగబడే పరిస్థితిని ప్రభుత్వమే తెచ్చింది

వ్యవసాయంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండున్నర కోట్ల మంది ఆధారపడి జీవిస్తున్నారని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, పంట నష్టాలకు పరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే అన్నదాతల్లో ఆగ్రహం పెరుగుతుందని హెచ్చరించారు.

రైతులు ప్రభుత్వంపై తిరగబడే అనివార్య పరిస్థితులను పాలకులే సృష్టిస్తున్నారని విమర్శించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి, విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, కె. మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, ధర్మా నాయక్, మాధవ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, శంకర్ నాయక్, చిట్యాల రాము, నారాయణ నాయక్, టీక్యా నాయక్, గోవింద నాయక్, అలీం తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సదాశివపేట, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మహిళలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన పండుగ అని అన్నారు. హనుమాన్ నగర్‌లోని హనుమాన్ మందిరం నుంచి డప్పు వాయిద్యాల మధ్య బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువచ్చి దుర్గమ్మ పోచమ్మ మందిరం ఆవరణలో సంబరాలు నిర్వహించారు. వేడుకలను ఘనంగా ఏర్పాటు చేసిన కౌన్సిలర్ సోమశేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ వేడుకల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. వార్డు పెద్దలు, మహిళలు, యువతీ యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అమృత్ 2 పథకంలో భాగంగా పనుల పరిశీలన



**మక్తల్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డు పరిధిలో అమృత్ 2 పథకంలో భాగంగా కొత్త పైప్ లైన్ పనులు జరుగుతుండటంతో రహదారి ఇబ్బందిగా మారగా.. సిబ్బంది సహకారంతో రహదారిని బాగు చేసినట్లు వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నూతన పైప్ లైన్ పనులు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. పనులు పరిశీలించిన వారిలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, కోఆప్షన్ నెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్ సిబ్బంది తదితరులున్నారు.

## గౌడ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్
- కల్లుగీత కార్మిక సంఘం 69వ ఆవిర్భావ వేడుకలు



**సంగారెడ్డి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** గౌడ కులస్తుల సంక్షేమం, కల్లుగీత కార్మికుల ఉపాధి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారి వృత్తిని ఆధునికీకరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ గీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద కల్లుగీత కార్మిక సంఘం 69వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ జెండాను ఆవిష్కరించగా, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ , గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్‌లు మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘం 69 ఏళ్లుగా గీత కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.

### షరతులు లేకుండా పెన్షన్లు అందించాలి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన 37,381 మంది గీత కార్మికులు కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారందరికీ ఎలాంటి షరతులు విధించకుండా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.

### ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమి ఇవ్వాలి

గీత కార్మికుల ఉపాధిని మెరుగుపరిచేందుకు ప్రతి గీత కార్మిక సొసైటీకి చెట్ల పెంపకం కోసం ఐదెకరాల భూమిని కేటాయించాలని రమేష్ గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రైతుబంధు తరహాలో గీత కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని, కల్లుగీత వృత్తిని ఆధునికీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రకృతి సంపదను కాపాడుతూ తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, గౌడ సంఘం యువ నాయకుడు మధు గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, ప్రచార కార్యదర్శి వెంకటేశం గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్, యాద గౌడ్, ప్రవీణ్ గౌడ్, రవి గౌడ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పాండు గౌడ్, కవి, రచయిత ఉమ్మన్నగారి కృష్ణ గౌడ్, నాయకులు సంగమేశ్వర్ గౌడ్, దుర్గ గౌడ్, నరసింహ గౌడ్, రాములు గౌడ్, ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- అధికారులకు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

**వనపర్తి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాంరెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పరిష్కార సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఆదేశించారు. తమ శాఖ పరిధిలోకి రాని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు లేఖల ద్వారా పంపించాలని సూచించారు. పరిష్కరించలేని సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లేదా నిబంధనల ప్రకారం ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో ఫిర్యాదుదారులకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. అంతేకానీ, దరఖాస్తులను కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉంచకూడదని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 30 దరఖాస్తులు అందగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మరో 3 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 19 (జనం సాక్షి) :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా సాయుధ దళ కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పాల్గొని పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా పోలీస్ శాఖలో ఆయుధ పూజ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ, చెడును అరికట్టి, ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సిబ్బందికి, జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ ముందస్తుగా విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య, ఆర్ఐలు నరేష్, వెంకటేష్,హారిఫ్, గద్వాల సీఐ శ్రీను, ఆర్ఎస్‌లు, సాయుధ దళ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**కౌడిపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కౌడిపల్లి మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొనగా, నిర్వాహకులు ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని, తునికి నల్ల పోచమ్మ, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సార్, రామ గౌడ్, మాజీ సిడిసి చైర్మన్ దుర్గా రెడ్డి, వార్డు సభ్యులు రాజిరెడ్డి, సందీప్ కుమార్, సంగప్ప, స్థానిక నాయకులు, పోల నవీన్, మహమ్మద్ నగర్ సర్పంచ్ రవి యాదవ్, మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై కపట ప్రేమను మానుకోవాలి

- మంగంపల్లి ఘటనను రాజకీయ స్వార్థానికి వాడుకోవద్దు
- కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజకుమార్

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** మంగంపల్లి ఆలయ ప్రవేశ ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజకుమార్ బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. దళితుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే గతంలో జరిగిన ఘటనలపై ఎందుకు స్పందించలేదో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. సోమవారం వనపర్తిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజకుమార్‌తో పాటు కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంకిని వెంకటేష్, సీనియర్ నాయకులు మహేష్, పెద్దమందడి మండల అధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్ తదితరులు మాట్లాడారు.

### నేరెళ్ల ఘటనపై అప్పుడెందుకు మాట్లాడలేదు..?

దళితుల సంక్షేమం, ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వ హయాంలో నేరెళ్లలో జరిగిన ఘటనపై సమాధానం చెప్పాలని రాజకుమార్ ప్రశ్నించారు. ఇసుక టిప్పర్ల వ్యవహారంలో దళితులపై దాడులు జరిగినప్పుడు వారి దళిత ప్రేమ ఎక్కడికి పోయిందని నిలదీశారు. అప్పట్లో దళితుల సమస్యలపై స్పందించకుండా, ఇప్పుడు మంగంపల్లి ఘటనను రాజకీయంగా ఉపయోగించుకోవడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యలు చేసినప్పుడు దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడేవారు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దళితుల సమస్యలపై అన్ని సందర్భాల్లోనూ ఒకే వైఖరితో వ్యవహరించాలని హితవు పలికారు.

### ఘటనపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

మంగంపల్లి ఘటన గురించి తెలిసిన వెంటనే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జిల్లా ఎస్పీ, డీఎస్పీలతో మాట్లాడి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారని రాజకుమార్ తెలిపారు. తప్పు చేసినవారు ఎవరైనా చట్టం ముందు సమానమేనని పేర్కొన్నారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి దళిత సామాజిక వర్గానికి చెందిన నాగన్న ప్రధాన అర్చకుడిగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఘటనకు సంబంధించి సుధీర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో, మీడియా ముందు చేసిన వ్యాఖ్యల్లో కులదూషణ అంశం ప్రస్తావనకు రాలేదని తెలిపారు. ఈ అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు.

### దళితులకు ఏం చేశారో నిరంజన్‌రెడ్డి చెప్పాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు జరిగిన అన్యాయాలపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సమాధానం చెప్పాలని రాజకుమార్ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో 132 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని పేర్కొంటూ, దళితుల సంక్షేమంపై మాట్లాడే ముందు గత పాలనలో జరిగిన పరిణామాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. మెంటపల్లి గ్రామపంచాయతీలో జనరల్ స్థానంలో దళిత అభ్యర్థిని నిలబెట్టి గెలిపించిన ఘనత ఎమ్మెల్యే మేఘారెడ్డిదేనని పేర్కొన్నారు.




కులాలకు అతీతంగా నాయకత్వాన్ని ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు.

### లెటర్ ప్యాడ్ వినియోగంపై ఫిర్యాదు చేస్తాం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో జరుగుతున్న జాప్యంపై జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసిన అంశాన్ని రాజకీయంగా వక్రీకరిస్తున్నారని రాజకుమార్ ఆరోపించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పదవిలో లేనప్పుడు మాజీ మంత్రి హోదాకు సంబంధించిన లెటర్ ప్యాడ్‌ను ఎలా ఉపయోగించారని ప్రశ్నించారు. దళితులను అవమానించేలా లేఖలో వ్యాఖ్యలు చేసినట్లు తమకు అభ్యంతరాలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చట్టపరంగా తప్పులు జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. అయితే మంగంపల్లి ఘటనను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం మానుకుని, వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు గంధం రాజశేఖర్, పెద్దమందడి మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కదిరే

# సేవా భావమే నిజమైన దైవభక్తి



- అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**మహదేవపూర్ అక్టోబర్ 19 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్ హౌస్ సుదర్శనలో భాగంగా మహదేవ పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధి శ్రీ గర్భగౌరీ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహర్నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో కొలువుదీరిన శ్రీ మహిషాసురమర్ధిని అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఆమెకు వేదాశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, దైవభక్తి అనేది కేవలం పూజలు, ఆచారాలకే పరిమితం కాకూడదని అన్నారు. సమాజంలోని తోటివారిని ఆదరించడం, ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించడం ద్వారానే నిజమైన దైవభక్తిని చాటుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని జగన్మాతను ప్రార్థించినట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్నదానం, ప్రసాద వితరణ కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న దాతలను, స్థానిక భక్తులను ఆమె అభినందించారు. సమాజ హితం కోసం సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరి కుటుంబంపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రావణవధ కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు

- దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు
- భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో అక్టోబర్ 20న నిర్వహించనున్న రావణవధ కార్యక్రమానికి పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. సోమవారం సాయంత్రము వరంగల్ పోలీస్ కమిషనర్ గారు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి రావణవద జరిగే ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా నిర్వహించే ఈ రావణవధ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు, ప్రజలు, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## భారీ వాహనాల డ్రైవర్లకు ముఖ్య సూచన

దసరా ఉత్సవాలు, రావణవధ కార్యక్రమం నేపథ్యంలో వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. సంబంధిత ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో అనుమతి లేని భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. భారీ వాహనాల డ్రైవర్లు ముందస్తుగా ట్రాఫిక్ పోలీస్ శాఖ సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు.

## ప్రజలకు ట్రాఫిక్ సూచనలు

రావణవధ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. వాహనాలను పోలీస్ శాఖ సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైనంత ముందుగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకోవాలి. - ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటే, పోలీస్ శాఖ సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి. అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదు. చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలు తప్పిపోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి సహకరిస్తూ, క్రమశిక్షణతో వ్యవహరించాలి.

## పోలీస్ శాఖకు సహకరించాలి

రావణవధ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ రావణవధ కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు భాగస్వాములు కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు ఏసీపీ లు నర్సింహారావు, ప్రశాంత్ రెడ్డి, మధుసూదన్, సదయ్య , సత్యనారాయణ, సిఐలు కర్రె స్వామి, మంగిలాల్, సుజాత, ఎస్ఐలు, ఇతర శాఖల ఉన్నతాదికారులు మరియు దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆదివాసీల జోలికొస్తే ఊరుకునేది లేదు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఆదివాసీలపై దాడి చేసిన అటవీ అధికారిపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలి
- పోడు భూముల సమస్య పరిష్కరించాలని నెన్నెల మండలం కోణంపేట గ్రామస్తుల వినతి



**నెన్నెల, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** బెల్లంపల్లి, నెన్నెల మండలం కోణంపేట గ్రామానికి చెందిన గిరిజనులు తమ పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. వేమనపల్లి మండలం చామనపల్లి శివారులో తమకు ఉన్న పోడు భూములను సాగు చేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని కోణంపేట గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 2021--22లో తమకు హక్కుగా రావాల్సిన పోడు భూములను పొందకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఇటీవల అటవీ అధికారులు ఆదివాసీలపై దాడి చేయడంతో పాటు, 20 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సానుకూలంగా స్పందించారు. జైపూర్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడి, ఆదివాసీలపై దాడి చేసిన అధికారులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని కోరారు. ఆదివాసీల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మంచిర్యాల జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ)తో ఫోన్‌లో మాట్లాడి కోణంపేట ఆదివాసీల పోడు భూముల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజిరి మాధవి, సోపిరి మారక్క, పసుల భాగ్య, మంచాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు చరిత్రాత్మక రావణ వధ మహోత్సవం

- 26 ఏళ్ల ఘన చరిత్రకు నిలువెత్తు నిదర్శనం





**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 20(జనంసాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లా గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేడుక, ములుగు ఖ్యాతిని దశదిశలా చాటుతున్న రావణ వధ మహోత్సవానికి నేడు (మంగళవారం) ములుగు జిల్లా కేంద్రం ముస్తాబైంది. సాధన స్కూల్ ఎదుట సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా జరగనున్న ఈ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. అపూర్వ ఘన చరిత్ర:లి 2001లో ములుగు జూనియర్ కళాశాలలో ఒక చిన్న సంకల్పంగా మొదలైన ఈ మహా యజ్ఞం, నేడు 26 ఏళ్ల ఘన చరిత్రతో వటవృక్షంగా ఎదిగింది. గత 25 సంవత్సరాలుగా ఏ ఒక్క సంవత్సరం ఆగకుండా నిర్విరామంగా సాగుతున్న ఈ సంప్రదాయం ములుగు గడ్డ మీద సనాతన ధర్మ పరిరక్షణకు నిలువెత్తు నిదర్శనం. రాజకీయాలకు అతీతంగా, కులమతాలకు అతీతంగా సెలబ్రిటీలు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, యువత అందరినీ ఒకే తాటిపై నడిపిస్తూ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. హిందూ పండుగల పరమార్థమే పదిమందిని కలపడం. ఆ స్ఫూర్తితోనే ఈ రావణ వధ కార్యక్రమం వేలాది మందిని ఒకే చోట చేర్చి, ఆనందోత్సవాల మధ్య, కోలాహలంగా పండుగ వాతావరణాన్ని తీసుకువస్తోంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, భావితరాలకు ధర్మాన్ని అందించాలనే ఉన్నత ఆశయంతో ఈ వేడుకను నిర్వహిస్తున్నారు.

## ప్రముఖుల రాకతో కళ

ఈ చారిత్రక వేడుకకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ములుగు ముద్దుబిడ్డ డాక్టర్ దనసరి అనసూయ సీతక్క , జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ల ను ఘనంగా ఆహ్వానించామని నిర్వాహకులు తెలిపారు. వారి రాకతో ఈ వేడుకకు మరింత వన్నె వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల సౌకర్యార్థం భారీ వేదిక, విద్యుత్ కాంతుల అలంకరణ, విశాలమైన పార్కింగ్ స్థలం, వేలాది మంది కూర్చొని వీక్షించేందుకు గ్యాలరీ, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం వంటి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ, ధర్మ జాగరణ సమితి అధ్యక్షుడు, ఈ మహోత్సవ సారథి గంద్రకోట కుమార్ మాట్లాడుతూ.. "ఈ కార్యక్రమం ఏ ఒక్క వ్యక్తిది కాదు, మనందరిది. ములుగు ప్రజలందరిది. ఇది మన సంస్కృతి, మన వారసత్వం. ప్రతి ఒక్కరూ ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా, మానవత్వంతో, ఒకరిపట్ల ఒకరు ఆదరాభిమానాలతో, గౌరవంతో మెలగుతూ ఈ కార్యక్రమాన్ని తిలకించాలి. క్షేమంగా వచ్చి, ఆనందంగా చూసి, క్షేమంగా మీ గమ్యస్థానాలకు చేరుకోవాలి. గత పది రోజులుగా నిద్రాహారాలు మాని ఈ కార్యక్రమ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకు, దాతకు, శ్రేయోభిలాషికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు అని భావోద్వేగంగా కోరారు.

# ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 19(జనంసాక్షి) :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినం జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని కోరుకుంటూ జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సొంతింటి కల నెరవేరడంతో ఆదివాసీల హర్షం

- ఇళ్ల వద్ద మహిళల ఆటపాటలు



**ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామమైన కొలంగూడలో ఇందిరమ్మ ఇళ్ల వద్ద బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీడీవో రాధా రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలు బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలాడారు. కొత్తగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల వద్ద మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. సొంత ఇంటి వద్ద బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో తమ కుటుంబాలకు భరోసా లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాథోడ్, సర్పంచ్ ఆత్రం అర్జున్, ఉపసర్పంచ్ సోనేరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమ్రావు, కడారి నరేష్, బిక్కు నాయక్, ఆనంద్‌రావు, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పిర్యా, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్‌లో గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్
- 5.232 కిలోల ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం
- రూ.2.70 లక్షల విలువైన గంజాయి పట్టివేత: జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమురంభీం అసిఫాబాద్ ప్రతినిధి/ రెబ్బెన,అక్టోబర్19 (జనం సాక్షి):** రెబ్బెన, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద రెబ్బెన పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 5.232 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.70 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. అరెస్టయిన జుమూర్ గెయిన్ ఈ నెల 14న ఒడిశాకు వెళ్లి పింటూ అనే వ్యక్తి వద్ద రూ.15 వేలతో 5.232 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అనంతరం గంజాయితో కాగజ్‌నగర్‌కు తిరిగి వచ్చినట్లు తెలిపారు. ఆమె మంచిర్యాల వైపు ప్రయాణిస్తుండగా, ఆమె భర్త సురంజన్ గెయిన్ స్కూటీపై వేచి ఉండి గంజాయిని తీసుకుని ఇంటికి తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద రెబ్బెన పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 5.232 కిలోల ఎండు గంజాయి లభించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ (నంబర్ టీజీ20 ఎ 1148)ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 353/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) ఆర్ /డబ్ల్యు 20(బి)(ఋ)(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ గంజాయి సరఫరా వ్యవహారంలో ఒడిశాకు చెందిన పింటూతో పాటు మంచిర్యాలకు చెందిన మున్నీ, జైపూర్‌కు చెందిన చంద్రశేఖర్, రాజు తదితరుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేయాల్సి ఉంది, ఈ అక్రమ రవాణా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. గంజాయి అక్రమ రవాణాను గుర్తించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, ఇన్‌చార్జి వాంకిడి సీఐ వేణుగోపాల్, రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణ, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, ఈ తరహా అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- ఆరుగురు అరెస్ట్..
- రూ.86,230 నగదు స్వాధీనం



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్19 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, ఆర్ఎస్ఐ ప్రవీణ్ , సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి రూ.86,230 నగదు,6 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వడ్డే కుమార్ , దురిశెట్టి శ్రీనివాస్ ,కర్ణ వెంకటేష్ ,సల్లు సతీష్ , సల్ల సాధానందం,కొట్టే కిషోర్ లను పోలీసులు అందులో తీసుకొని విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు,సెల్‌ఫోన్లు, బైక్‌తో సహా తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# తాండూర్ ప్రజావాణికి అరకొర స్పందన



- కొన్ని శాఖల అధికారులే హాజరు

**తాండూర్, అక్టోబర్ 19(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి, అధికారుల నుంచి స్పందన కరవైంది. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేవలం కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవాల్సిన పలు ముఖ్యమైన శాఖల అధికారులు రాకపోవడంతో అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, సాధారణంగా అత్యధికంగా ఫిర్యాదులు వచ్చే రెవిన్యూ విభాగానికి సంబంధించి ఈ ప్రజావాణిలో కేవలం ఒక్క అర్జీ మాత్రమే రావడం గమనార్హం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, బాధితులకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19(జనంసాక్షి ):** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని జైనూర్ మండల కేంద్రానికి చెందిన ఆత్రం శంభు మండల కేంద్రంలో నూతన మీ సేవా కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన వేములవాడ రవీందర్ తాను ప్రభుత్వ ఆసుపత్రిలో దోబీగా పని చేస్తున్నానని, తనకు ఆరోగ్యం సహకరించనందున తన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ టి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాకేష్ కుమార్ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన జుమ్మిడి అరుణ తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం అనుకూడా గ్రామానికి చెందిన శంకర్ తమ గ్రామంలోని పాఠశాలలో వంటగది నిర్మాణం చేశానని, బిల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం పొలస గ్రామానికి చెందిన కుర్సింగ సురేఖ తనకు గ్రామంలో గల అంగన్వాడీ టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవేగాం గ్రామానికి చెందిన గుర్నూలె ఉషారాణి తమ గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం
20 అక్టోబర్ 2026

## ప్రారంభానికి నోచుకోని రాయపట్నం నూతన పంచాయతీ భవనం

- అద్దె భవనంలోనే పాలన




**మధిర, అక్టోబర్ 19 (జనంసాక్షి)** : మధిర మండలం రాయపట్నం గ్రామంలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోకుండా గత ఆరు నెలలుగా మూతపడి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన నిధులతో నిర్మించిన ఈ భవనం నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ ప్రారంభోత్సవం చేయకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి, రంగులు వెలిసిపోయే పరిస్థితి నెలకొంది.కాగా నూతన భవనం పూర్తయినా ప్రారంభించకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఇప్పటికీ లిఅద్దె భవనంలోనే పంచాయతీ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రతి నెలా అద్దె రూపంలో ప్రభుత్వ ధనం వృధా అవుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒకవైపు లక్షలతో కట్టిన భవనం మూతపడి ఉంటే, మరోవైపు అద్దె భవనానికి అద్దె చెల్లించాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. పాత/అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహించడం వల్ల సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కలుషిత కూపాల్లో 'బతుకమ్మ'..

- చోద్యం చూస్తున్న అధికారులు...
- గుర్రపుడెక్క, నాచు గడ్డి మధ్యే నిమజ్జనాలు
- నరకప్రాయంగా మారిన ఘాట్లు.. ముక్కులు మూసుకుంటున్న మహిళలు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

**మణుగూరు, అక్టోబర్ 19 (జనంసాక్షి)** : తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, పూల పండుగ బతుకమ్మకు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఏటా పండుగ వస్తే చాలు.. ఏర్పాట్ల పేరిట లక్షల రూపాయల నిధులు కాగితాలపై ఖర్చు చూపిస్తున్న పాలకులు, క్షేత్రస్థాయిలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన చెరువులు, కుంటలలో గుర్రపుడెక్క గడ్డి, నాచుతో నిండిపోయి కలుషిత కూపాలుగా మారినా.. కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పవిత్రంగా పూజించిన బతుకమ్మలను నాచు గడ్డి, బురద గుంటల్లో నిమజ్జనం చేయాల్సి రావడంపై మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### అడుగడుగునా మున్సిపల్ వైఫల్యం

పండుగకు వారం రోజుల ముందే చెరువులను శుభ్రం చేయాలని, ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తున్నా.. మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది మాత్రం ఏసీ గదులకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన గుర్రపుడెక్క గడ్డిని తొలగించడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసింది. గడ్డి మధ్యలోనే బతుకమ్మలను వదలాల్సి వస్తోంది. ఆ వ్యర్థాలు కుళ్ళిపోయి ఘోరమైన దుర్వాసన వస్తున్నా.. అధికారులు మాత్రం "మాకేం పట్టనట్లు" చోద్యం చూస్తున్నారు.

### ప్రాణాలతో చెలగాటం.. భద్రత శూన్యం

నాచు, పిచ్చి గడ్డి, నాపరాయి, బురద పేరుకుపోవడంతో నిమజ్జన ఘాట్ల వద్ద మహిళలు, చిన్నపిల్లలు కాలు జారి పడిపోయారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలిగించక పోవడంతో దోమల మధ్యన ఉండలేక ప్రసాదం పంచి పెట్టే పరిస్థితి లేక మహిళలు తీవ్ర అసంతృప్తితో వెళ్ళిపోయారు. కనీసం సదుపాయాలు ఏర్పాటు చేయడంలో బారికేడ్లు కట్టడం కానీ, రక్షణ సిబ్బందిని ఉంచడం కానీ తూతూమంత్రంగానే చేశారనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. లైటింగ్ ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంతో చీకటి పడ్డాక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు ఎటు పోతున్నాయి? పారిశుద్ధ్య సిబ్బంది ఏం చేస్తున్నారు? అని అడిగితే అధికారుల నుంచి సమాధానం కరువైంది.

### ప్రజల ఆగ్రహం.. ఇకనైనా కళ్ళు తెరుస్తారా..?



తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మను సాక్షాత్తు గౌరీదేవిగా పూజిస్తారు. పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డను ఏ విధంగా అయితే సగౌరవంగా సాగనంపుతామో, అలాగే గౌరమ్మను కూడా నీటిలో నిమజ్జనం చేసి సాగనంపుతారు. నీరు జీవానికి, పవిత్రతకు చిహ్నం. నేలపై వేస్తే దేవతను అవమానించినట్లు అవుతుందని నమ్ముతారు. బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి, తామర వంటి అనేక రకాల ఔషధ గుణాలున్న అడవి పూలతో పేరుస్తారు. ఈ పూలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల, వాటిలోని ఔషధ గుణాలు నీటిలో కరిగి, నీటిని శుద్ధి చేస్తాయి. బాక్టీరియాను నశింపజేస్తాయి. పూర్వ కాలంలో బతుకమ్మలను నిమజ్జనం చేసిన తర్వాత ఆ పూలన్నీ నీటి అడుగునకు చేరి, మట్టితో కలిసి ఒక పొరలా ఏర్పడేవి. ఇది చెరువులలో నీరు ఇంకిపోకుండా నిలిపి ఉంచడానికి సహాయపడేది. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. గౌరమ్మను పూజించి, చివరికి నేలపై ఇలాంటి మురికి కూపంలో సాగనంపాల్సి రావడం మా దౌర్భాగ్యం" అంటూ మహిళలు మున్సిపల్ అధికారులపై శాపనార్థాలు పెడుతున్నారు.

## పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన టీజీఎస్పిసి చైర్మన్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 19 (జనం సాక్షి)** : తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ నియామకాల కోసం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అక్టోబర్ 24, 26 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, అభ్యర్థుల తనిఖీలు, సాంకేతిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ఇతర మౌళిక వసతులపై టీజీపీఎస్సీ చైర్మన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు డిసీపీ రామానుజన్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూలి సుమారు ఏడాదిన్నర విరామం అనంతరం ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు మళ్లీ ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఇకపై వరుసగా పలు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉందని, చిన్నపాటి పొరపాటు జరిగినా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం



ఉంటుందని పేర్కొన్నారు.

తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్, అక్టోబర్ 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు .ఎన్నికలను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తామో, ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలను కూడా అంతే బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో జిల్లా కలెక్టర్లదే కీలక బాధ్యత అని, ప్రతి అధికారి తనకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి లోపం జరిగినా అది మొత్తం యంత్రాంగం వైఫల్యంగా పరిగణించబడుతుందని తెలిపారు.

### పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

పరీక్షా కేంద్రాల్లో పోలీసు బందోబస్తు, అభ్యర్థుల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. అభ్యర్థులతో పాటు పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహించే సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, తనిఖీ కోసం వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకు రాకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే నిర్దేశిత నిబంధనల ప్రకారం సెల్‌ఫోన్ వినియోగానికి సంబంధించిన వెసులుబాటు ఉంటుందని, ఆ వినియోగం కూడా పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఇతరులతో ఏదైనా సమాచారం పంచుకోవాల్సి వస్తే చీఫ్ సూపరింటెండెంట్ ద్వారానే మాట్లాడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎవరు కూడా సెల్‌ఫోన్లు వినియోగించకుండా కఠినంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాలని, ఇన్విజిలేటర్లకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకురావడం లేదా వినియోగించడం చేయకూడదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ ఏ. శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- మాజీ ఎంఎల్ఏ సండ్ర



**పెనుబల్లి, అక్టోబర్ 19 (జనం సాక్షి)** : పెనుబల్లి మండలంలో ఖమ్మం – వరంగల్––నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ తొరగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచించారు. సోమవారం పెనుబల్లి మండలం ఉప్పలచిలుకలో బిఆర్ఎస్ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులను గుర్తించి, మండలవ్యాప్తంగా కొత్త ఓటరు నమోదులు పెద్ద సంఖ్యలో జరిగేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పాత పట్టభద్రుల ఆన్ లైన్ నమోదు తప్పనిసరి అని అవగాహన కలిగిన వాళ్లు వాళ్ల మొబైల్ లో ఆన్లైన్ చేసుకోవచ్చు అని అలాకాకుండా ఎవరికైనా ఆన్లైన్ ఇబ్బందులు ఉంటే టిఆర్ఎస్ పార్టీ ఏర్పడేసిన ఆన్లైన్ కేంద్రాల్లో చేయించే విధంగా చూడాలని ఎప్పటికప్పుడు పర్సంటేజ్ పరిశీలించి ఆన్లైన్ విధానం పైనే దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలల మోహన్ రావు,ముఖ్య నాయకులు, శీలం నాగిరెడ్డి,చెక్కిలాల లక్ష్మణరావు, లగడపాటి శ్రీనివాసరావు, చింతనిపు శ్రీనివాసరావు, టీవీ రామారావు, బెల్లంకొండ చలపతిరావు, కోమటి ప్రసాద్, కొప్పుల గోవిందరావు, చెలికాని నీలాద్రి బాబు, వెంకట అప్పారావు తన్నీరు కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగకు వేతనాలివ్వని అధికారిని సస్పెండ్ చేయాలి

- స్వీపర్ల మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
- ఏఐటీయూసీ నేతలు

**వనపర్తి రూరల్, అక్టోబర్ 19 (జనం సాక్షి)** : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జెడ్పీ కంప్యూటర్ ఆపరేటర్ రాఘవను సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. మోష, సహాయ కార్యదర్శి కె. శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పార్ట్‌టైమ్ స్వీపర్లుగా పనిచేస్తున్న కార్మికులకు నెలకు కేవలం రూ.5,200 వేతనం ఇస్తున్నారని, అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి చెల్లిస్తుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇతర జిల్లాల్లో మూడు నెలల వేతనాలు చెల్లించినప్పటికీ, వనపర్తి జిల్లాలో మాత్రం జాప్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వేతనాల చెల్లింపునకు సంబంధించిన లేఖను ఎస్‌టీఓకు పంపకపోవడం వల్లే జీతాలు అందడం లేదని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




దసరా పండుగ అనంతరం కూడా సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న స్వీపర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి భాస్కర్, సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, స్వీపర్ల సంఘం నాయకులు కయ్యూం, అభిమన్యు, గోపాల్ గౌడ్, భాస్కర్, వెంకటేష్, చంద్రమ్మ, శ్యామ్ సుందర్, శాంతన్న, బాల పీర్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి చేరికలు

**గుడిపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి)** : దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.సోమవారం గుడిపల్లి మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు

### కాంగ్రెస్‌లో 20 కుటుంబాల చేరిక

గుడిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన దాదాపు 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బాలు నాయక్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువవుతున్నాయని,కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

### అంగడిపేటలో ప్రత్యేక పూజలు

అనంతరం పి.ఏ.పల్లి మండలం అంగడిపేట గ్రామంలోని దుర్గామాత



ఆలయాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కృపాకటాక్షాలతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో నెర్మటి సతీష్ రెడ్డి,మావిల్ల లక్ష్మీనారాయణ యాదవ్,తేర సత్యనారాయణ రెడ్డి,వంగాల ప్రతాప్ రెడ్డి,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుక్కల గోవర్ధన్ రెడ్డి,మద్దిమడుగు రామస్వామి, శేఖర్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి,ఎల్లయ్య యాదవ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు మంత్రి తుమ్మల ఆదేశాలు

- మూడు జిల్లాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం
- నవంబర్ నుంచి సీతమ్మసాగర్ పనులకు సన్నద్ధం కావాలని సూచన
- స్థానిక రైతులకు న్యాయం జరగకపోతే ఉద్యమం చేపడుతాం సిపిఎం

**అశ్వాపురం, అక్టోబర్ 19 (జనంసాక్షి)** : రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పరిశీలించారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, మూడు జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

### ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు చర్యలు

దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని



మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నీటి నిల్వను పెంచేందుకు ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేసి అందుబాటులో ఉన్న నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉన్నప్పుడే మిగులు నీటిని ఇతర అవసరాలకు వినియోగించాలని, నీటి నిల్వపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

### తుమ్మల చెరువు నింపేదెప్పుడు?

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు చర్యలు ప్రకటించిన నేపథ్యంలో, అశ్వాపురం మండలంలోని తుమ్మల చెరువు కింద సాగు చేస్తున్న రైతులకు నీరు ఎప్పుడు అందిస్తారో స్పష్టం చేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. గోదావరి నది సమీపంలోనే ఉన్నప్పటికీ తుమ్మల చెరువు ఎందుకు నిండటం లేదని ప్రశ్నించింది. ఖరీఫ్ సీజన్‌లో చెరువు కింద 20 శాతం మంది రైతులు కూడా పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది.

### రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వానికి సీపీఎం హెచ్చరిక

ఒకవైపు నీటి నిల్వ పెంపు, ప్రాజెక్టుల నిర్మాణం, నీటి పొదుపుపై ప్రభుత్వం దృష్టి సారిస్తుండగా, మరోవైపు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న స్థానిక రైతులకు సాగునీరు అందకపోవడంపై సీపీఎం ప్రశ్నలు లేవనెత్తింది. తుమ్మల చెరువు నింపడం, యాసంగి పంటలకు నీటి సరఫరా, మారెళ్లపాడు లిఫ్ట్ నిర్వహణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.స్థానిక రైతులకు సాగునీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని సీపీఎం అశ్వాపురం మండల కమిటీ హెచ్చరించింది.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన అశ్వారావుపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి

- మంత్రికి మొక్కను అందజేసి మర్యాదపూర్వక భేటీ



**దమ్మపేట, అక్టోబర్ 19 (జనం సాక్షి)** : తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అశ్వారావుపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూల మొక్కను అందజేసి తన గౌరవాన్ని తెలియజేశారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి భేటీ కావడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది. మొక్కను అందజేసే కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది.మొక్కల పెంపకం,పచ్చదనం పరిరక్షణ వంటి అంశాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నేపథ్యంలో మంత్రికి మొక్కను అందజేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఇతరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 20.10.2026



### టెల్ అవీవ్-వియన్నా విమానానికి
## బాంబు బెదిరింపు.. అత్యవసర ల్యాండింగ్

**జనంసాక్షి:** బాంబు బెదిరింపు నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ నుంచి వియన్నాకు వెళ్తున్న విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం బల్గేరియా రాజధాని సోఫియా(రానీటతిజీ)లో సురక్షితంగా దిగింది. రొమేనియా సరిహద్దు సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో విమాన సిబ్బందికి బాంబు బెదిరింపు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫ్లైట్‌ను సోఫియాకు మళ్లించారు. బల్గేరియా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఫైటర్ జెట్.. ఈ విమానం సోఫియాలో ల్యాండ్ అయ్యే వరకు ఎస్కార్ట్‌గా వచ్చింది. విమానం దిగిన వెంటనే అందులోని 51 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందిని బయటకు తరలించారు. అనంతరం భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన బెదిరింపుతో ఈ ఘటన జరిగినట్లు ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. ఫ్లైట్‌లో అనుమానాస్పద వస్తువు కనిపించడంతో భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తినట్లు పేర్కొంది. ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించేందుకు వెళ్తోన్న ఇజ్రాయెల్ యువ ప్రతినిధుల బృందం కూడా ఈ విమానంలో ఉన్నట్లు తెలిపింది. అయితే.. బాంబు బెదిరింపుపై పూర్తి వివరాలు ఎయిర్‌లైన్స్ వెల్లడించలేదు. పై దుబాయ్ విమానంలో ఆందోళన తలెత్తిన కొన్ని వారాలకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19 (జనంసాక్షి):** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 21 ఫిర్యాదులు, వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కార పురోగతితో పాటు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, దరఖాస్తుదారులకు తగిన న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**విజయదశమి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి**

**జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుభాకాంక్షలు**

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో పండుగను నిర్వహించడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. అలాగే విజయదశమి పర్వదినం జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపి, మరిన్ని విజయాలు సాధించేలా ప్రేరణనివ్వాలని కోరారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

# కొత్తపల్లి సొసైటీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ

### కాంగ్రెస్‌లో ఇద్దరు ఆశావహులు! .. అధిష్ఠానం నిర్ణయంపై ఆసక్తి



**గంభీరావుపేట (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్న అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ నర్సింహారెడ్డి, దమ్మ శ్రీనివాస్ రెడ్డి ఆశావహులుగా ఉన్నట్లు సమాచారం. దీంతో పార్టీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్న దానిపై చర్చ మొదలైంది.

**ఇద్దరిలో ఎవరికి దక్కేను?**

కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న ఇద్దరు నాయకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కోసం చేసిన సేవలు, నాయకులతో ఉన్న సంబంధాలు, సీనియారిటీ తదితర అంశాలు పదవి ఎంపికలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయన్న చర్చ సాగుతోంది.

**అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ!**

చైర్మన్ పదవి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది. ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని పార్టీ ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. అయితే, తుది నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.

**ఎవరికి దక్కనున్న పీఠం?**

కొత్తపల్లి ప్యాక్స్ చైర్మన్ పదవికి ఇద్దరు ఆశావహులు ఉండటంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుంది? ఇద్దరిలో ఎవరి పేరును ఖరారు చేస్తుంది? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పెద్దల నిర్ణయం వెలువడే వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది.



# పండుగ ముగిసినా అందని చీరలు!

### పండుగ హామీలు ఏమయ్యాయి..? మహిళల్లో అసంతృప్తి

**తెలంగాణ ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ ముగిసిపోయింది. పూల పండుగకు మహిళలు ఘనంగా వీడ్కోలు పలికినా.. ప్రభుత్వం అందిస్తుందని ఆశించిన చీరల జాడ మాత్రం కనిపించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పండుగ సందర్భంగా మహిళలకు అందాల్సిన చీరలు సకాలంలో అందకపోవడంతో ప్రభుత్వ హామీల అమలుపై చర్చ మొదలైంది.**



**సదాశివనగర్ అక్టోబర్19 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైనది. అలాంటి పండుగ వేళ మహిళలకు చీరలు అందిస్తే వారి ఆనందం రెట్టింపయ్యేది. కానీ పండుగ ముగిసిన తర్వాత కూడా చీరలు అందకపోవడంపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పండుగకు ముందే పంపిణీ చేయాల్సిన చీరలు.. పండుగ అయిపోయిన తర్వాత ఇస్తే ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పండుగకు ముందు పంపిణీ చేయలేని పరిస్థితి ఎందుకు? చీరల పంపిణీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించిందా? చీరల కొనుగోలు, సరఫరా, పంపిణీ ప్రక్రియ ఎక్కడ నిలిచిపోయింది? అర్హులైన మహిళలకు ఎప్పటిలోగా చీరలు అందిస్తారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పథకాల అసలు ఉద్దేశం ప్రజలకు సకాలంలో ప్రయోజనం చేకూర్చడమే. పండుగల సందర్భంగా ప్రకటించే సంక్షేమ కార్యక్రమాలు సమయానికి అమలైతేనే ప్రజలకు వాటి ప్రయోజనం అందుతుంది. పండుగ పూర్తయిన తర్వాత పంపిణీ చేపడితే ఆ పథకం వెనుక ఉన్న ప్రత్యేక సందర్భం, మహిళల ఆశలు నీరుగారే పరిస్థితి ఏర్పడుతుంది. హామీలు ప్రకటనలకే పరిమితం కాకూడదు.. అమలులోనూ కనిపించాలి! మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పే ప్రభుత్వం, బతుకమ్మ చీరల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. చీరల పంపిణీకి సంబంధించిన వాస్తవ పరిస్థితిని వెల్లడించి, అర్హులైన మహిళలకు ఎప్పటిలోగా అందిస్తారో అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. బతుకమ్మ పండుగ ముగిసింది.. సంబరాలు ముగిశాయి.. కానీ మహిళలకు చీరలపై ఎదురుచూపులు మాత్రం కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళలకు చీరలు అందిస్తుందా? లేక మరో ప్రకటనతోనే సరిపెడుతుందా? అన్నది వేచి చూడాలి.

### అల్బర్టా సైనిక స్థావరంలో అగ్నిప్రమాద ఘటన..
## 19 మంది పరిస్థితి విషమం

**జనంసాక్షి:** కెనడాలో సంభవించిన అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అల్బెర్టా ప్రావిన్స్‌లోని వేన్‌రైట్ సైనిక స్థావరంలో చెలరేగిన మంటల్లో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 39 మంది గాయపడ్డారు. వారిలో 19 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గంటకు సుమారు 96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సహాయక బృందాలు.. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. సైనిక శిక్షణలో ఉపయోగించే మందు గుండు పేలడంతోనే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాలను అవనతం (పతాకాన్ని సంతాప సూచకంగా కొద్దిసేపు జెండా కర్రకు సగం ఎత్తులో ఎగరవేయడం) చేయాలని ఆదేశించారు. కెనడా సైన్యం ఎదుర్కొన్న అత్యంత విషాదకర ఘటనల్లో ఇదొకటని పేర్కొన్నారు.

## సద్దుల బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే దంపతులు

గోదావరిఖని,జనంసాక్షి: సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గోదావరిఖనిలోని ఆర్ సిఈఓఏ క్లబ్‌లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, రంగురంగుల పూలతో అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు బతుకమ్మ ఆడి ఆకర్షణంగా నిలిచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆనందాన్ని పెంపొందిస్తుందని ఎమ్మెల్యే దంపతులు పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.



## అడవి పందుల దాడిలో వరి పొలం ధ్వంసం

### కన్నీరు పెడుతున్న రైతు

**రుద్రంగి, అక్టోబర్ 19(జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అడవి పందుల బీభత్సం కొనసాగుతోంది. మండల కేంద్రానికి చెందిన రైతు రాజం కు చెందిన ఒక ఎకరం వరి పొలం అడవి పందుల దాడిలో పూర్తిగా ధ్వంసమైంది. రైతు రాజం అప్పు చేసి ఎకరం పొలంలో వరి పంట సాగు చేశాడు. పంట కోతకు వచ్చిన దశలో ఉండగా ఆదివారం రాత్రి అడవి పందుల గుంపు పొలంలోకి చొరబడి వరి కంకులను తొక్కేసి, పంటను నేలమట్టం చేసింది. ఆదివారం ఉదయం పొలాన్ని చూసిన రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. "ఎకరం పంట కోసం రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టాను, ఒక్క రాత్రిలో అంతా పోయింది అని ఆవేదన వ్యక్తం చేశాడు. రుద్రంగి పరిసరాల్లో అడవి పందుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, రాత్రంతా కాపలా కాసినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన రైతును అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు పరామర్శించి తగిన నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# నిరసనల మధ్య జాగింగ్..

### ఆశ్చర్యానికి గురిచేసిన మహిళ..!

నిరసనలు, హింసాత్మక ఘటనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతోంది. ఎటుచూసినా మంటలు, దట్టమైన పొగలే కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓ మహిళ ఏమాత్రం బెదరకుండా.. ఆ హింసాత్మక ప్రదేశం నుంచి జాగింగ్ చేస్తూ వెళ్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మండుతున్న బారికేడ్ పక్క నుంచి ఆమె ఎంతో ప్రశాంతంగా పరుగెడుతూ వెళ్లడం చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు 'ఆమె దేశం కోసం కాదు.. తన ఫిట్‌నెస్ కోసం పోరాడుతోంది' అంటూ 'ఇంటర్నెట్‌లో ఇదే అత్యంత వింతైన ఫిట్‌నెస్ వీడియో' అని కామెంట్ చేస్తున్నారు. ఒక పక్క నిరసన జరుగుతుంటే.. వ్యాయామం అవసరమా? అంటూ కొందరు మండిపడుతున్నారు.



# అనిల్ పండిత్ ఎవరు..?

### టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల వెనుక హస్తమెంత?

**ముంబై:** దసరా వేళ వాణిజ్య రాజధాని ముంబయి మరోసారి ఉలిక్కిపడింది. సరిగ్గా రెండేళ్ల క్రితం ఈ పండుగ రోజునే మాజీ మంత్రి, ఎన్సీపీ సీనియర్ నేత బాబా సిద్ధిఖీ హత్యకు గురయ్యారు. మళ్లీ ఇప్పుడు నటుడు టైగర్ ష్రాఫ్‌ను కొందరు దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ కాల్పుల్లో నటుడు ప్రాణాలతో బయటపడ్డారు.. కానీ, కొన్నిచోట్ల గన్‌పౌడర్ కారణంగా కాలిన గాయాలయ్యాయి. ఈ ఘటనలో ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలో కాల్పులకు ముందు నిందితుల కదలికలకు సంబంధించిన కొన్ని దృశ్యాలు బయటకు వచ్చాయి. అలాగే అమెరికాకు చెందిన గ్యాంగ్‌స్టర్ అనిల్ పండిత్ ఈ కాల్పులకు తానే బాధ్యుడినని ప్రకటించుకున్నాడు. దీనికి సంబంధించిన ఆడియో క్లిప్‌ను పలు భద్రతా సంస్థలకు పంపాడు.

**ఎవరీ అనిల్ పండిత్..?**

ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన కాల్పులకు తానే బాధ్యుడినంటూ అనిల్ పండిత్ హిందీ చిత్రపరిశ్రమపై బెదిరింపులకు పాల్పడ్డాడు. ప్రముఖ నటుడు సల్మాన్‌ఖాన్.. లారెన్స్ బిష్ణోయ్ బిష్ణోయ్ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాడు. సల్మాన్‌తో కలిసి పనిచేసేవారిని చంపేస్తామంటూ బెదిరించాడు. టైగర్‌కు ఇప్పటికే వార్నింగ్ ఇచ్చినా పట్టించుకోలేదని, ఇక ఇదే తన నుంచి వచ్చే చివరి హెచ్చరిక అంటూ ఆ క్లిప్‌లో పేర్కొన్నాడు. అలాగే సల్మాన్ కుటుంబానికి బెదిరింపులు పంపాడు. అయితే ఆ ఆడియో క్లిప్ విషయంలో ఎలాంటి ధ్రువీకరణ లేదు.

**తర్వాత ఎవరు? బాలీవుడ్‌కు రక్షణ కల్పించండి..**

హరియాణాలోని పానిపత్‌కు చెందిన అనిల్ పండిత్.. 2024లో అక్రమమార్గం (డంకీ రూట్)లో అమెరికాకు వలసవెళ్లినట్లు తెలుస్తోంది. తర్వాత నుంచి బిష్ణోయ్ గ్యాంగ్‌తో పనిచేయడం ప్రారంభించినట్లు సమాచారం. భారత్‌లో ఉన్నంతవరకు అతడిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని.. ఆ తర్వాత మాత్రం అతడిపై పలు కేసులు నమోదైనట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఆడియో క్లిప్‌లో లారెన్స్ బిష్ణోయ్ పేరు వాడినప్పటికీ.. పండిత్ నేరుగా అతడి నుంచి ఆదేశాలు అందుకోలేదని వారు చెప్పారు. అనిల్‌కు హ్యాండ్లర్‌గా ఉన్న హరీ బాక్సర్ (హరిచంద్ జాట్) 2022 నుంచి యూఎస్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని, అతడిపై రాజస్థాన్, పంజాబ్, దిల్లీలో దోపిడీ, హత్యాయత్నం కేసులు ఉన్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే.. ఈ ఏడాదిలో బాలీవుడ్‌కు సంబంధించిన పలువురు వ్యక్తుల లక్ష్యంగా బిష్ణోయ్ గ్యాంగ్ పేరిట కాల్పులకు తెగబడింది. ఫిబ్రవరిలో బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పలు రౌండ్లు కాల్పులు జరిపారు. అయితే నాడు రోహిత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. జూన్‌లో పంజాబీ సింగర్ గురురంధ్వాకు చెందిన జిమ్‌ను లక్ష్యంగా చేసుకొని దుండగులు కాల్పులకు తెగబడ్డారు.

## 'తాగి పాడుతున్నావ్ ఆపు!'..

### - దలేర్ మెహందీని అడ్డుకున్న మంత్రి

**దేహ్రాదూన్:** ప్రముఖ పంజాబీ గాయకుడు దలేర్ మెహందీకి చేదు అనుభవం ఎదురైంది. నవరాత్రి వేడుకల్లో భాగంగా పాట ఆలపిస్తుండగా.. మంత్రి ఆయన్ను అడ్డగించారు. మద్యంమత్తులో పాడుతున్నావంటూ పాడొద్దని సూచించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో జరుగుతున్న ఉత్సవాలకు దలేర్ మెహందీ హాజరయ్యారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాట ఆలపిస్తుండగా.. నరేంద్రనగర్ ఎమ్మెల్యే, ఉత్తరాఖండ్ మంత్రి సుబోధ్ ఉనియాల్ నేరుగా వేదికపైకి వెళ్లి దలేర్ మెహందీ పాటను ఆపేశారు. "నవరాత్రుల సందర్భంగా దుర్గామాత కోసం ఏర్పాటు చేసిన పవిత్ర కార్యక్రమం ఇది. ఇలాంటి చోట మీరు మద్యం తాగి పాడటం ఏమాత్రం సరికాదు" అంటూ గాయకుడిపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. వేదిక పవిత్రతను, మర్యాదను కాపాడాలని గాయకుడిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే, "దయచేసి వేదికను వీడండి" అంటూ దలేర్ మెహందీ రెండు చేతులు జోడించి మంత్రికి విజ్ఞప్తి చేయడం కనిపించింది. "సరిగా మాట్లాడలేకపోతున్నావ్.. ఏం పాడతావ్" అంటూమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాసేపటి తర్వాత మంత్రి స్టేజీని వీడారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది. మంత్రి ఆరోపణలపై దలేర్ మెహందీ గానీ, ఆయన టీమ్ గానీ వివరణ ఇవ్వలేదు.





# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

### గన్నేరువరం వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**గన్నేరువరం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** గన్నేరువరం మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రత్యేక లైటింగ్ సిస్టం, డీజే సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేశారు. ఆడపడుచుల బతుకమ్మ నృత్యాలతో ఘాట్లు కళకళలాడాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆటలు ఆడగా, యువతీ యువకుల డాన్సులు, సందడితో మండలమంతా పండుగ వాతావరణం నెలకొంది. గన్నేరువరం మండల కేంద్రంలో సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యే వివిధ గ్రామాల్లో పర్యటించారు. గుండ్లపల్లి ఎక్స్ రోడ్డులో సర్పంచ్ చింతల ఉమారాణి - అనిల్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. గుండ్లపల్లిలో సర్పంచ్ కాల్వ పద్మ - కోమరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యస్వాడలో సర్పంచ్ కటకం తిరుపతి ఆధ్వర్యంలో లైటింగ్, డీజేతో కోలాహలం. జంగపల్లిలో సర్పంచ్ తాడూరి కరుణా శ్రీ - వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఖాసీంపేటలో సర్పంచ్ కర్నె చంద్రయ్య ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. మాదాపూర్ లో సర్పంచ్ మాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. మహిళల ఉత్సాహం మధ్య వేడుకలు విజయవంతం అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కటకం తిరుపతి,చొక్కారావు పల్లె గ్రామ సర్పంచ్ అరికాంతం గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, గన్నేరువరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి అనిల్, గన్నేరువరం గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి,గన్నేరువరం ఉప సర్పంచ్ రామంచ స్వామి,ఖాసీంపేట ఉప సర్పంచ్ సందవేణి ఐలయ్య,జంగపల్లి ఉప సర్పంచ్ మహంకాళి ప్రభాకర్, నాయకులు బుర్ర తిరుపతి గౌడ్, దొగ్గల ప్రదీప్ మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీజీపీ కార్యాలయంలో ఆయుధపూజ

హైదరాబాద్, అక్టోబర్ 19 (జనంసాక్షి) : డిజిపి కార్యాలయంలో సోమవారం డిజిపి సి.వి. ఆనంద్ దుర్గాపూజ, ఆయుధపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజి మహేష్ భగవత్, ఏ ఐ జి అడ్మిన్ రమణ కుమార్, స్టోర్స్ డిఎస్పి, సిఎస్ఓ తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి అధికారులకు దసరా కానుక

- అధికారుల విజ్ఞప్తిని నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కోలిండియా తరహా వేతనాల పెంపునకు సింగరేణి ఉత్తర్వులు జారీ
- ఎగ్జిక్యూటివ్ క్యాడర్-1 నుంచి 7 వరకు సుమారు 1,800 మందికి ప్రయోజనం
- సెప్టెంబర్ 25 వ తేదీ నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తింపు



హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి అధికారుల చిరకాల విజ్ఞప్తిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరింది. కోలిండియా తరహా వేతనాలను అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్-1 నుంచి ఎగ్జిక్యూటివ్ క్యాడర్-7 వరకు ఉన్న సుమారు 1,800 మంది అధికారులకు ప్రయోజనం చేకూరనుంది. సవరించిన బేసిక్ వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. అయితే, ఆర్థిక ప్రయోజనాలు సింగరేణి బోర్డు ఆమోదం తెలిపిన సెప్టెంబర్ 25, 2026 నుంచి వర్తిస్తాయి. ఈ పెరిగిన వేతనాలను అక్టోబరు నెల జీతాల నుంచి చెల్లించనున్నారు. సవరించిన వేతనాల అమలుకు సంబంధించి సంస్థ డైరెక్టర్ (పర్సనల్) శ్రీ గౌతమ్ పోట్రు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

కోలిండియాలో వేతన అసమానతల నేపథ్యంలో, మహారత్న సంస్థల వేతన విధానాన్ని తమకు అమలు చేయాలని కోలిండియా అధికారులు కోరారు. ఆ ప్రతిపాదనకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోలిండియా యాజమాన్యం ఆమోదం తెలిపాయి. అదే విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని సంస్థ అధికారులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన భట్టి విక్రమార్క దసరాలోపు అధికారులకు శుభవార్త అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది జులైలో సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం కమిటీని ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగా బోర్డు ఆమోదంతో వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, ఇచ్చిన హామీని నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం మరింత అంకితభావంతో బొగ్గు ఉత్పత్తి చేసి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతామని పేర్కొన్నారు.

### ఇటీవలే కార్మికులకు 596 కోట్ల బోనస్...

ఇటీవలే దసరా సందర్భంగా సింగరేణిలోని దాదాపు 39 వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం తీపి కబురుగా 596 కోట్ల రూపాయల బోనస్ అందించిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సింగరేణి లోని కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారికి రూ.5,500 చొప్పున బోనస్ ను ప్రకటించారు. తాజాగా అధికారులకు వేతన సవరణపై ఉత్తర్వులు వెలువడటం విశేషం.

**కొత్త వేతనాల ప్రకారం అధికారుల బేసిక్ వేతనాలు**

| క్యాడర్ | పాత బేసిక్ | కొత్త బేసిక్ వేతనం |
|---|---|---|
| ఈ-1 | రూ.40,000 | రూ.60,000 |
| ఈ-2 | రూ.50,000 | రూ.70,000 |
| ఈ-3 | రూ.60,000 | రూ.80,000 |
| ఈ-4 | రూ.70,000 | రూ.90,000 |
| ఈ-5 | రూ.80,000 | రూ.1,00,000 |
| ఈ-6 | రూ.90,000 | రూ.1,20,000 |
| ఈ-7 | రూ.1,00,000 | రూ.1,20,000 |

## సంక్షోభం వచ్చిన ఆర్నెళ్లకు 'ఉపసంఘమా?

- ఎల్ నినో విపత్తు ముమ్మాటికీ రేవంత్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్ర ధ్వజం
- ముఖ్యమంత్రి, కేబినెట్ ఉపసంఘానికి 23 సూటి ప్రశ్నలతో బహిరంగ లేఖ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణను తీవ్రంగా కుదిపేస్తున్న కరువు, ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొనే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇది ప్రకృతి సృష్టించిన విపత్తు కాదని, ముమ్మాటికీ పాలకుల చేతగానితనం మరియు నేరపూరిత పరిపాలనా నిర్లక్ష్యమేనని బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అక్టోబర్ 19న విడుదల చేసిన జీవో నెంబర్ 1523 ద్వారా ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కేవలం బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి వేసిన ఒక కాలయాపన ఎత్తుగడ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ సభ్యులకు 23 సూటి ప్రశ్నలతో కూడిన సమగ్ర బహిరంగ లేఖను విడుదల చేశారు. ఏప్రిల్ రెండో వారంలోనే ఎల్ నినో ముప్పు పొంచి ఉందని, వర్షపాతం లోటు ఉంటుందని దేశవ్యాప్తంగా హెచ్చరించింది. మార్చి బడ్జెట్ సమావేశాల నుంచే నిపుణులు నెత్తీనోరూ బాదుకున్నారని, ప్రభుత్వం ఆరు నెలల పాటు కుంభకర్ణ నిద్ర పోయిందని, వర్షాకాలం ముగిసి 19 రోజులు గడిచాక, 18 జిల్లాల్లో తీవ్ర వర్షపాత లోటు నమోదై, రిజర్వాయర్లు అడుగంటి, రైతులు పెట్టిన ఖరీఫ్ పంటలు చేతికి రాక ఎండిపోతుంటే ఇప్పుడు తీరిగ్గా మంత్రివర్గ ఉపసంఘం వేయడం ప్రభుత్వ పాలకుల దివాళాకోరుతనానికి నిదర్శనం. ఇది క్రైసిస్ మేనేజ్‌మెంట్ కాదు, క్రైసిస్ ముగిశాక చేస్తున్న "కాగితాల మేనేజ్‌మెంట్" అని శ్రవణ్ మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1523ని పరిశీలిస్తే ఈ కమిటీ ఎంతటి డొల్లతనంతో కూడుకున్నదో అర్థమవుతోందని, ఉపసంఘం తన నివేదికను ఎప్పటిలోగా సమర్పించాలో నిర్దిష్ట గడువు లేదని, గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 3 లక్షల నల్లా కనెక్షన్లకు డిసెంబర్ నాటికి తీవ్ర తాగునీటి ముప్పు పొంచి ఉందని తెలిసినా, ఈ కమిటీలో మున్సిపల్ పరిపాలనా శాఖకు, జలమండలికి కనీస ప్రాతినిధ్యం కల్పించకపోవడం గర్హనీయమని, జూలైలోనే నిపుణుల కమిటీ ఇచ్చిన రూ. 817 కోట్ల అత్యవసర సిఫార్సులను (విత్తన రాయితీ, సూక్ష్మ సేద్యం, పశుగ్రాసం) బుట్టదాఖలు చేసిన ప్రభుత్వం, ఇప్పుడు కొత్త కమిటీతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని ఆరోపించారు.

## దక్షిణాఫ్రికాలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



దక్షిణాఫ్రికా, అక్టోబర్ 19 (జనంసాక్షి) : దేవీ నవరాత్రుల సందర్భంగా ఎస్ఎస్‌డీసీవో దక్షిణాఫ్రికా ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 18వ తేదీ ఆదివారం నాగయ్యాస్ మాల్‌లోని ఎస్ఎస్‌డీసీవో దేవీ మండపంలో జరిగిన ఈ వేడుకలకు 650 మందికి పైగా తెలుగు ప్రజలు, భక్తులు హాజరయ్యారు. దేవీ నవరాత్రుల్లో నిత్య పూజలు, ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించేందుకు భారతదేశం నుంచి వేద పండితులు శ్రీ మనోహర్ శర్మ ప్రత్యేకంగా విచ్చేశారు. ఆయన ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించిన పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ, గౌరమ్మను కొలిచే తెలంగాణ పండుగ బతుకమ్మ. చివరి రోజున వివిధ రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించి, ఆటపాటలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ వేడుకలు తెలుగు కుటుంబాలను ఒక్కచోట చేర్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శ్రేణులు తమ కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. లిబీఆర్ఎస్ ఎన్నారై శ్రేణుల భాగస్వామ్యాన్ని అరవింద్ చికోటి సమన్వయం చేశారు.లి మిత్రులందరూ ఒకచోట చేరి, అందంగా పేర్చిన బతుకమ్మలతో గౌరమ్మను పూజించారు. మహిళల బతుకమ్మ ఆటపాటలు, చిన్నారుల సందడితో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆత్మీయ పలకరింపులు, ఆనందోత్సాహాల మధ్య చిన్నారులు, పెద్దలు అందరూ కలిసి సంబరాలు చేసుకున్నారు. విదేశీ గడ్డపై మన సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ కుటుంబాలు, మిత్రులతో కలిసి జరుపుకున్న ఈ వేడుకలు తెలుగు ప్రజల ఐక్యతకు అద్దం పట్టాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో ఎస్ఎస్‌డీసీవో కమిటీ సభ్యులు అరుణ్ సుంకు, రాజేష్ యార్లగడ్డ, శ్రీధర్ బొల్లోజు, సాతులూరి లక్ష్మీ శ్రీనివాస్, నిర్మల్ నల్లులి ముందుండి ఏర్పాట్లను సమన్వయం చేశారు. వేడుకలకు తరలివచ్చిన తెలుగు కుటుంబాలకు, భక్తులకు, బీఆర్ఎస్ ఎన్నారై శ్రేణులకు, సహకరించిన స్వచ్ఛంద సేవకులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సద్దుల బతుకమ్మ వేడుకలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. అలాగే, కేప్‌టౌన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో, చేతన్ కొరోబోయిన సమన్వయంతో కేప్‌టౌన్‌లో కూడా బతుకమ్మ సంబరాలు జరిగాయి. దక్షిణాఫ్రికాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ప్రవాసుల అనుబంధాన్ని చాటాయి.

**ద్విచక్ర వాహనం అమ్మకానికి కలదు**

వాటర్ సంస్థ ద్వారా 2011లో కొనుగోలు చేసిన హీరో సీడీ డీలక్స్ ద్విచక్ర వాహనం (నంబరు: ఏపీ 21 ఏజె 7512) అమ్మకానికి కలదు. ఆసక్తి గల వారు 25-10-2026వ తేదీలోపు క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించగలరు. సంప్రదించవలసిన నంబర్లు: 9963603129, 7899388369

గమనిక: వాహనానికి సంబంధించిన ఆర్‌సీ అందుబాటులో లేదు.

## లండన్‌లో ఘనంగా 'టాక్-చేనేత బతుకమ్మ దసరా'సంబరాలు

- రెండు వెయ్యిలకు పైగా హాజరైన ప్రవాస కుటుంబ సభ్యులు
- ప్రత్యేక అతిథిగా ఎఫ్డీసి మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం





లండన్ (జనంసాక్షి) : తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో చేనేత బతుకమ్మ, దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. రెండు వేల మందికి పైగా ప్రవాసులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎంపీ రూత్ క్యాడ్బరీ, మాజీ ఎంపీ వీరేంద్రశర్మ, మేయర్ రణ్జిత్ గిల్, శాంతను రాజావత్, ప్రత్యేక అతిథిగా టాక్ వ్యవస్థాపకుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం పాల్గొన్నారు. చేనేతకు చేయూతనివ్వడమే వేడుకల లక్ష్యమని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల తెలిపారు. మహిళలు బతుకమ్మ ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. శమీ పూజ, అలాయ్ బలాయ్ నిర్వహించి చేనేత శాలువాలు, జమ్మి ఆకులు పంచుకున్నారు. ఉత్తమ బతుకమ్మలకు బంగారు నాణేలు అందజేశారు. నాగరాజు తౌటంను సన్మానించారు. కార్యక్రమంలో శుష్మణ రెడ్డి, సురేష్ బుడగం, రాకేష్ పటేల్, సుప్రజ పులుసు, సత్యపాల్ రెడ్డి పింగళి, శ్రీకాంత్ జెల్లా, అశోక్ గౌడ్ దూసరి, మట్టా రెడ్డి, మల్లా రెడ్డి, గణేష్ కుప్పాల, పవిత్ర కంది, స్వాతి బుడగం, సత్యమూర్తి చిలుమల, వెంకట్‌రెడ్డి దొంతుల, సత్యం కంది, రవి రేతినేని, రవి ప్రదీప్, హరి గౌడ్, రవి పులుసు, క్రాంతి రేతినేని, జాహ్నవి, శశి, తేజ, నిఖిల్, నాగరాజు, ప్రవీణ్ వీర, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 14 నెలల ఆహార భద్రతకు ప్రణాళిక

- ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత
- పౌరసరఫరాల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 19(జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావం, పంట నష్టాలు, ఆహార ధరల పెరుగుదలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పించేందుకు 14 నెలల వరకు అవసరాలను తీర్చేలా ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే వ్యవసాయ సీజన్లలో వర్షపాతం తగ్గినా రేషన్ సరఫరాలకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రానున్న వరి పంట దిగుబడిపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం కింద మధ్యాహ్న భోజనం తదితర అవసరాలకు కలిపి నెలకు సుమారు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మంత్రి తెలిపారు. ఈ లెక్కన వార్షిక అవసరం 28.56 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. 2026 అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇందులో కేంద్ర పూల్, ఇతర సంక్షేమ పథకాల కింద 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, రాష్ట్ర పూల్ కింద 6.14 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్), ఇతర గుర్తించిన సరఫరాల ద్వారా మరో 18.39 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉందన్నారు. ప్రస్తుత నిల్వలు, అందాల్సిన బియ్యం కలిపితే మొత్తం లభ్యత 28.03 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పరిమాణం ప్రజాపంపిణీ, ఇతర సంక్షేమ పథకాల అవసరాలకు సుమారు 11.7 నెలలపాటు, అంటే 2027 సెప్టెంబర్ వరకు సరిపోతుందని వివరించారు. మిల్లర్లు, ఇతర వనరుల నుంచి రావాల్సిన బియ్యం నిర్ణీత గడువులోగా ప్రభుత్వ గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ప్రకృతి వైపరీత్యాలతో భవిష్యత్తులో పంటలు దెబ్బతిన్నా లక్షలాది కుటుంబాల ఆహార భద్రతకు భంగం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.




## సరూర్‌నగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ థీమ్‌తో రూపొందించిన బతుకమ్మకు తొలి బహుమతి



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ప్రాంతంలో అంగరంగ వైభవంగా జరిగాయి. సరూర్‌నగర్ గ్రౌండ్‌లో ప్రీతం గౌడ్, రెడ్డి బ్రదర్స్ సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చి మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక థీమ్‌తో రూపొందించిన బతుకమ్మకు విశాల తొలి బహుమతిని గెలుచుకున్నారు. నిర్వాహకులు గత 15 సంవత్సరాలుగా సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తూ, బతుకమ్మ పోటీల్లో బహుమతులు అందజేస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఈ వేడుకలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని నింపాయి.









# కాంగ్రెస్‌లో ఇద్దరు ఆశావహులు!

- కొత్తపల్లి సొసైటీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ
- అధిష్ఠానం నిర్ణయంపై ఆసక్తి



**గంభీరావుపేట, అక్టోబర్ 19 జనం సాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్న అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ నర్సింహారెడ్డి, దమ్మ శ్రీనివాస్ రెడ్డి ఆశావహులుగా ఉన్నట్లు సమాచారం. దీంతో పార్టీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్న దానిపై చర్చ మొదలైంది.

### ఇద్దరిలో ఎవరికి దక్కేను?

కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న ఇద్దరు నాయకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కోసం చేసిన సేవలు, నాయకులతో ఉన్న సంబంధాలు, సీనియారిటీ తదితర అంశాలు పదవి ఎంపికలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయన్న చర్చ సాగుతోంది.

### అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ!

చైర్మన్ పదవి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది. ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని పార్టీ ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. అయితే, తుది నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.

### ఎవరికి దక్కనున్న పీఠం?

కొత్తపల్లి ప్యాక్స్ చైర్మన్ పదవికి ఇద్దరు ఆశావహులు ఉండటంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుంది? ఇద్దరిలో ఎవరి పేరును ఖరారు చేస్తుంది? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పెద్దల నిర్ణయం వెలువడే వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (జనంసాక్షి) : వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య కార్యక్రమం పరిధిలో గత 20 ఏళ్లుగా వివిధ 78 కేడర్లలో ఒప్పంద, పొరుగు సేవల విధానంలో సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమం సంయుక్త కార్యాచరణ కమిటీ ఉద్యోగుల ప్రతినిధులు ఆయనను నివాసంలో కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.




ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమం సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. క్రమబద్ధీకరణతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను విన్న గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అండగా ఉంటుందని అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమం సంయుక్త కార్యాచరణ కమిటీ అధ్యక్షులు తల్లపల్లి సుమన్‌తో పాటు మారుతి, హరీష్, పద్మజ, సందీప్, మనోజ్‌కుమార్, భారత్‌కుమార్, ప్రవీణ్, అశ్విని, హరీష్‌గౌడ్, అఖిల్‌గౌడ్, నవీన్, వేణుమాధవ్, కవిత, స్వరూప, సుజాత, సరిత, ఇంద్ర, స్వప్న, సునీత, యాద్దామ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19 జనం సాక్షి: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26వ తేదీలలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీ.బీ.టీ) విధానంలో జరుగనున్న పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్టు (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 24, 26 తేదీలలో పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 24న అసిస్టెంట్ సైంటిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. 26వ తేదీన కూడా అవే సమయాలలో అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ లలో పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 24వ తేదీ నాటి పరీక్షకు 90 మంది అభ్యర్థులు, 26వ తేదీ నాటి పరీక్షకు 190 మంది హాజరు కానున్నారని తెలిపారు. కాపీయింగ్, లీకేజీలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి ఉదయం 8.00 గంటల నుండే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని, నిమిషం ఆలస్యం అయినా అనుమతించబడరని తెలిపారు.

# అక్రమ కల్తీ కల్లుపై అధికారుల మౌనం!

- నిద్రమ్మత్తులో ఆబ్కారీ శాఖ.. డైజోఫామ్ ఆరోపణలపై చర్యలేవి?
- సెలవులు కలిసొచ్చాయా?
- దసరా వేళ తనిఖీలు ఏవి?
- శాంపిళ్ల సేకరణపై స్పష్టత ఏది?

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (జనంసాక్షి): పండుగ వేళ ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాల్సిన నిజామాబాద్ ఆబ్కారీ శాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లా స్థాయి అధికారి, ఎస్‌హెచ్ఓ సెలవులో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్రమ కల్లు విక్రయాలు, కల్తీ కల్లుపై నిఘా ఎవరు నిర్వహిస్తున్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు సెలవులో ఉన్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తనిఖీలు కొనసాగించాల్సిన బాధ్యత శాఖపై ఉంది.

### డైజోఫామ్ ఆరోపణలు.. శాంపిళ్ల పరీక్షలేవి?

జిల్లాలోని కొన్ని కల్లు కాంపౌండ్లలో కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని, డైజోఫామ్ వంటి పదార్థాలు కలుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని నిర్ధారించేందుకు అనుమానాస్పద కాంపౌండ్ల నుంచి నమూనాలు సేకరించి గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షలు నిర్వహించాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు గడిచినా క్షేత్రస్థాయి పరిస్థితులపై పట్టు సాధించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాంతం కొత్తదైనా విధులు, తనిఖీల బాధ్యతలు కొత్తవి కావని ప్రజలు పేర్కొంటున్నారు.




### పండుగ వేళ పర్యవేక్షణ ఏది?

దసరా సందర్భంగా కల్లు విక్రయాలు పెరిగే అవకాశమున్నందున ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సరఫరా, నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలించాలి. అధికారులు సెలవులో ఉన్న సమయంలో ప్రత్యామ్నాయ బాధ్యతలు ఎవరికి అప్పగించారు? అనుమానాస్పద విక్రయాలపై ఫిర్యాదులు వస్తే స్పందించేది ఎవరు? అన్న ప్రశ్నలకు శాఖ సమాధానం చెప్పాలి. డైజోఫామ్ వినియోగంపై పరీక్షలు నిర్వహించారా? నమూనాలు సేకరించారా? అన్న వివరాలను వెల్లడించాలి.

### కల్తీ కల్లుపై మౌనమెందుకు?

ఒక ఇంట్లో అక్రమంగా విదేశీ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం అభినందనీయం. అయితే బెల్టు షాపులు, కల్లు కాంపౌండ్లలో కల్తీ పదార్థాలు విక్రయిస్తున్నారన్న ఆరోపణలపైనా అదే స్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ అండదండలతో కొందరు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణల్లో నిజానిజాలను తేల్చి, ప్రజారోగ్యానికి ముప్పు కలగకుండా ఆబ్కారీ శాఖ పారదర్శకంగా చర్యలు తీసుకోవాలి.

# గోవా అక్రమ మద్యం పట్టివేత.. ఒకరి అరెస్టు

**గంభీరావుపేట, అక్టోబర్ 19 జనం సాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.

ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్, గోరంటాల, లింగన్నపేట, సముద్ర లింగాపూర్, గజసింగవరం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంటాల గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు వద్ద అనుమతి పత్రాలు



లేకుండా నిల్వ ఉంచిన 750 ఎంఎల్ సామర్థ్యం గల 15 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెల్లడించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోహిస్, కానిస్టేబుళ్లు సిద్ది రాములు, కరుణాకర్, కృషిధర్, వర్ష తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగ వేళ విషాదం..

- ఆర్మీ జవాన్ ఆత్మహత్య
- ఆరు నెలల క్రితమే వివాహం

యాలాల అక్టోబర్ 19 ( జనంసాక్షి ) : దసరా పండుగ సందర్భంగా సెలవులపై స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ బోయిని మల్లేశం మృతి చెందడం లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన వేళ ఈ ఘటన చోటుచేసుకోవడంతో బంధువులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బోయిని మల్లేశంకు ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది. దసరా పండుగ కోసం ఇంటికి వచ్చిన ఆయన సోమవారం కుటుంబ సభ్యులతో గడిపినట్లు సమాచారం. అదే రోజు రాత్రి ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలు ఇంకా తెలియరాలేదు. కుటుంబానికి అండగా




నిలుస్తాడని ఆశించిన యువ జవాన్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వివాహమైన కొద్ది నెలలకే ఈ ఘటన చోటుచేసుకోవడం బంధువులను కలచివేసింది. పండుగ సందడితో కళకళలాడాల్సిన ఇంట్లో విషాదం నెలకొనడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఏడు వేల కుటుంబాల పిల్లల కోసం సమగ్ర ప్రభుత్వ పాఠశాల

## దుండిగల్‌లో భూమిపూజ చేసిన జయేష్ రంజన్

**హైదరాబాద్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీ పోచంపల్లిలో నిర్మించనున్న సమగ్ర ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ భూమిపూజ చేశారు. రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 ఆధ్వర్యంలో ఈ పాఠశాలను నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేసేందుకు ముందుకొచ్చిన సంస్థ ప్రతినిధులను అభినందించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ఈ పాఠశాల పరిసర ప్రాంతాల పిల్లలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.

రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 చైర్మన్ అనిరుధ్ సోంపల్లి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో



దాదాపు ఏడు వేల పేద కుటుంబాలు నివసిస్తున్నాయని, పిల్లలు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్య అందించడంతో పాటు విశాలమైన తరగతి గదులు, సైన్స్, స్టెమ్ ప్రయోగశాలలు, డిజిటల్ విద్యా సదుపాయాలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 'ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పిల్లలకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీవీ రావు, వనజ సోంపల్లి, అభిషేక్ అగర్వాల్, బీ లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల నిర్మాణ ప్రణాళికను మేక్‌స్పేస్ ఆర్కిటెక్ట్స్‌కు చెందిన రజత్ సంఘ్వీ రూపొందించారు.

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 19 (జనంసాక్షి) బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని మంత్రి కోరారు.



# సాతం రాయి ఏటీఎం చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

శంషాబాద్, అక్టోబర్19 (జనంసాక్షి): శంషాబాద్, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఏటీఎం చోరీ కేసును ఛేదించి ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు శంషాబాద్ డీసీపీ బి. రాజేశ్ తెలిపారు. సోమవారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. శంషాబాద్‌లోని సాతంరాయి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో గ్యాస్ కట్టర్‌తో యంత్రాన్ని ధ్వంసం చేసి రూ.7.40 లక్షల నగదు చోరీ చేసిన కేసులో రాజస్థాన్‌కు చెందిన రషీద్ అలియాస్ కాకూ (34)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చోరీలో మరో నలుగురు నిందితులు పాల్గొన్నట్లు, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు నిందితుడి నుంచి రూ.4,500 నగదు, ఏపీ 09 బీజీ 5020 నంబరు గల శాంట్రో కారు, టీజీ 07 ఏ 2293 నంబరు గల బజాజ్ పల్సర్ బైక్, ఒక గ్యాస్ కట్టర్‌తో పాటు పరికరాలు, ఒక గ్యాస్ సిలిండర్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల



మొత్తం విలువ రూ.1,84,500గా పోలీసులు వెల్లడించారు. నిందితుడు రషీద్‌పై గతంలో 46 కేసులు నమోదైనట్లు తెలిపారు. అడిషనల్ డీసీపీ కేఎస్ రావు పర్యవేక్షణలో శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణమోహన్, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ కేసును ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో శంషాబాద్ ఏసీపీ వి. శ్రీకాంత్ గౌడ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, శంషాబాద్, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పాల్గొన్నాయి. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు డీసీపి తెలిపారు.

# జిల్లా ప్రజలకు కలెక్టర్ విజయదశమి శుభాకాంక్షలు

## హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** విజయ దశమి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా ల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను ఈ పండుగ బోధిస్తుందని తెలిపారు. విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల ను నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలంద రికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాల ని, ప్రతి కుటుంబం విజయాలు సాధించాలని కలెక్టర్ కోరారు.

# చెట్టుకు బైకు ఢీకొని ఇద్దరు యువ కార్మికులు మృతి

శామీర్ పేట, అక్టోబర్ 19(జనం సాక్షి ): ఓ కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు యువ కార్మికులు అర్ధరాత్రి పూట బైక్ పై వెళ్తూ ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొని దుర్మరణం చెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం ఆదివారం అర్ధరాత్రి అలియాబాద్ సమీపంలోని బ్రిందా కన్వెన్షన్ హాల్ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డులో జరిగింది. బాధితుల, పోలీసుల కథనం ప్రకారం.. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాస్మోస్ మార్కి(22), సుమిత్ కుళ్ళు (23)అనే ఇద్దరు యువకులు కొన్నేళ్లుగా అలియా బాద్ మున్సిపల్ పరిధిలోని డైనమిక్ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. కాగా వీరిలో కాస్మోస్ అనే యువకుడు అలియాబాద్ లో నివాసం ఉంటుండగా, సుమిత్ బాలానగర్ లో నివాసం ఉంటున్నాడు. కాగా ఈనెల 18న ఆదివారం రాత్రి వీరిద్దరు కార్మికులు యధావిధిగా సెకండ్ షిఫ్టులో ఆ కంపెనీలో జాబ్ వరకు చేశారు. అలాగే ఆరోజు రాత్రి ఆ కంపెనీలో నిర్వహించిన దసరా ఉత్సవాల దావత్ లో మిగతా కార్మికులతో పాటు ఆ ఇద్దరు కార్మికులు కూడా పాల్గొని మద్యం త్రాగారు. అనంతరం అదే రాత్రి ఆ ఇద్దరు కార్మికులు కాస్మోస్, సుమిత్ లు టిజి 08 బిఎ 0904 నెంబర్ గల బైక్ పై డైనమిక్






కంపెనీ నుంచి బయలుదేరి అలియాబాద్ చౌరస్తా నుంచి ఆర్ అండ్ బి రోడ్డులో అలియాబాద్ గ్రామం వైపునకు అతివేగంగా, అ జాగ్రత్తగా వస్తున్నారు. కాగా రాత్రి దాదాపు 11:30 గంటల సమయంలో అలియా బాద్ సమీపంలోని ఆర్ అండ్ బి రోడ్డులోని బ్రిందా కన్వెన్షన్ హాల్ సమీపానికి రాగానే ఆ బైకు ప్రమాదవశాత్తు ఆ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొంది. ఈ రోడ్డు ప్రమాదంలో అ ఇద్దరు యువకులు కాస్మోస్, సుమిత్ లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వారి బైకు ప్రమాదంలో రెండు ముక్కలై ధ్వంసం అయింది. ఈ సంఘటన స్థలానికి సంబంధిత జీనోమ్ వ్యాలీ పోలీస్ ఇన్స్పెక్టర్ గురవయ్య వెంటనే వెళ్లి ఆ రోడ్డు ప్రమాద పూర్వాపరాలను పరిశీలించి విచారణ జరిపారు. ఆ ఇద్దరి కార్మికుల మృతదేహాల పై పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

## పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి): శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. సోమవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన వారాంతపు నేర సమీక్షలో పలు సూచనలు చేశారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన పెంచుకుని కేసుల దర్యాప్తు పకడ్బందీగా చేపట్టాలని, దసరా సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచాలని సూచించారు. చిన్నపాటి నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వర న్యాయం అందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370